
ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు


అమెరికా భారత ఉత్పత్తులపై పన్ను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గింపు

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in సంపుటి : 01 సంచిక : 53 బుధవారం 04 - 02 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-
Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in VOLUME : 01 Issue : 53 Wednesday 04 - 02 - 2026 Editor : Seggam Kiran Kumar Pages : 08 Price : 6/-

## హైదరాబాద్ రైల్వే
# హబ్ కాబోతుంది

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- వికసిత్ భారత్ 2047 కోసం పెట్టిన బడ్జెట్ అన్న కిషన్ రెడ్డి
- ఉచిత పథకాల కోసమే బడ్జెట్ అన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం
- ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందన్న కిషన్ రెడ్డి
- సైనీ బొగ్గు గనుల వ్యవహారంలో తెలంగాణ మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చుకుంది



**వార్త సంధ్య, హైదరాబాద్, ఫిబ్రవరి 03 :** హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2026-27 బడ్జెట్ ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్-2047 కోసం తీసుకువచ్చిన బడ్జెట్ అన్నారు. ఉచితాలు ప్రవేశపెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహదపడేలా బడ్జెట్ ఉందని అన్నారు.వీబీ జీ రామ్ జీ ద్వారా ఉపాధి హామీ పథకాన్ని - మిగతా 2 లో

## మేడారం జాతర
# విజయవంతం



- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- జాతర పనులు, గుడి పనులు సజావుగా జరిగాయని సంతోషం వ్యక్తం
- మేడారం జాతర ఏర్పాట్లు బాగున్నాయని ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ప్రశంసించారు
- క్లాస్, మాస్‌తోపాటు ఉన్నతస్థాయి వర్గాల వారు ఈ జాతరకు భారీగా తరలివచ్చారు
- సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు ఈ మేడారం జాతరకు వచ్చినట్లు భావిస్తున్నామన్నారు



## మున్సిపల్ ఎన్నికల రెబల్స్‌కు జగ్గారెడ్డి గట్టి హెచ్చరిక

సంగారెడ్డి, సదాశివపేటలలో రెబల్స్ బెడద
పార్టీ నిర్ణయాన్ని కాదని బరిలో నిలిస్తే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరిక
సంగారెడ్డిలో ఎనిమిది వార్డుల్లో రెబల్స్ పోరు

## భారత రక్షణ రంగంలో మరో కీలక ముందడుగు

- ఎస్ఎఫ్‌డీఆర్ పరీక్ష విజయవంతం
- ఎస్ఎఫ్‌డీఆర్ టెక్నాలజీని విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీవో
- ఒడిశాలోని చాందీపూర్ తీరంలో జరిగిన ప్రయోగం
- సుదూర గగనతల క్షిపణుల అభివృద్ధికి మార్గం సుగమం
- ఈ టెక్నాలజీతో భారత్‌కు పెరగనున్న వ్యూహాత్మక బలం





## లోక్‌సభలో
# తీవ్ర ఉద్రిక్తత

8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్
బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు వేటు వేసిన ఇన్చార్జి స్పీకర్
చైర్ వైపు కాగితాలు విసిరి, సభకు అంతరాయం కలిగించారని ఆగ్రహం
చైనా సరిహద్దు వివాదంపై చర్చకు పట్టుబట్టిన రాహుల్ గాంధీ
మాజీ ఆర్మీ చీఫ్ నరవణే పుస్తక ప్రస్తావనపై సభలో వాగ్వాదం

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం
## వ్యవసాయ ఉత్పత్తులపై కేంద్రం క్లారిటీ



- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- సహనమే గెలిపించింది
- అమెరికాతో ట్రేడ్ డీల్‌పై ఎన్‌డీఏ సమావేశంలో మాట్లాడిన ప్రధాని మోదీ
- రైతుల ప్రయోజనాల విషయంలో రాజీ లేదన్న కేంద్ర ప్రభుత్వం
- అమెరికా వ్యవసాయ, పాడి ఉత్పత్తులపై సుంకాలు తగ్గించేందుకు ససేమిరా
- వెనెజువెలా చమురు కొనుగోలు చేస్తామన్న కేంద్రం
- ఒప్పందం కుదరడంతో ప్రధాని మోదీని సంత్కరించిన కేంద్రమంత్రులు, ఎంపీలు

**వార్త సంధ్య, ఢిల్లీ, ఫిబ్రవరి 03 :** అమెరికాతో వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో, రైతుల ప్రయోజనం అంశంపై భారత ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అమెరికా, భారత్ వాణిజ్య ఒప్పందం జరిగిందని, అమెరికా ఉత్పత్తులను భారీగా కొనేందుకు భారత్ కట్టుబడి ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ట్రంప్ పోస్టు నేపథ్యంలో విపక్షాల నుంచి విమర్శలు వచ్చాయి. దీంతో కేంద్రం స్పందించింది.అమెరికా మన దేశానికి ఎగుమతి చేసే వ్యవసాయ, - మిగతా 2 లో

## నెయ్యి కల్తీపై
# ఏపీ కేబినెట్ సీరియస్

- శ్రీవారి నెయ్యి కల్తీపై కేబినెట్ సుదీర్ఘ సమీక్ష
- సీబీఐ నివేదికలోని అంశాలపై మూడున్నర గంటల చర్చ
- గత ప్రభుత్వ హయాంలో భారీ అక్రమాలు జరిగాయన్న మంత్రులు
- దోషులపై చర్యలకు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుకు నిర్ణయం
- తిరుమల పవిత్రతను కాపాడటమే లక్ష్యమని స్పష్టం చేసిన ప్రభుత్వం



**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 03 :** కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం తయారీలో నెయ్యి కల్తీ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర కేబినెట్ తీవ్రంగా స్పందించింది. మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఇతర అజెండా అంశాలను పక్కనపెట్టి, కేవలం ఈ అంశంపైనే సుమారు మూడున్నర గంటల పాటు సుదీర్ఘంగా చర్చించింది. కోట్లాది మంది హిందువుల మనోభావాలతో ముడిపడిన ఈ వ్యవహారంలో దోషులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని, తిరుమల పవిత్రతను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని కేబినెట్ అభిప్రాయపడింది. సీబీఐ సిట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టేందుకు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. సమావేశం అనంతరం మంత్రులు కొలుసు పార్థసారథి, పయ్యావుల కేశవ్, - మిగతా 2 లో

## విచారణ కమిషన్‌కు
# కేబినెట్ గ్రీన్ సిగ్నల్

- తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారం
- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ కీలక నిర్ణయం
- సిట్ నివేదిక, ఛార్జ్‌షీట్‌లో తేడాలు ఉన్నట్లు గుర్తింపు
- అసలు వాస్తవాలు తేల్చి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశం
- సూత్రధారుల్ని తేల్చేందుకు విచారణ కమిటీ
- మూడున్నర గంటల పాటు మంత్రివర్గ సమావేశం
- సిట్ సమర్పించిన నివేదికలో పాత్రధారులపై మాత్రమే సిఫార్సు చేసిందన్న మంత్రివర్గం
- అసలు సూత్రధారుల్ని తేల్చేందుకు విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం



**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 03 :** తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంపై అసలు సూత్రధారుల్ని తేల్చేందుకు విచారణ కమిటీ వేయాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో నిర్వహించిన మంత్రివర్గంలో సిట్ నివేదికపై చర్చ కొనసాగింది. అన్ని అంశాలు పక్కనపెట్టి మరీ తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై చర్చించారు. లడ్డూ కల్తీ జరిగిన విధానం, వివిధ విభాగాల తప్పిదాలను వివరిస్తూ నివేదిక ఉంది. ఇందులో ప్రభుత్వానికి సిట్ సమర్పించిన నివేదికలో పాత్రధారులపై మాత్రమే సిఫార్సు చేసిందని ఏపీ మంత్రి వర్గం అభిప్రాయపడింది.అసలు సూత్రధారుల్ని తేల్చేందుకు కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. విచారణ అంశాలకు, ఛార్జ్ షీట్‌లో ఉన్న - మిగతా 2 లో

# ఢిల్లీలో నారా లోకేశ్

- నేడు కేంద్రమంత్రులతో వరుస సమావేశాలు
- రాష్ట్ర అభివృద్ధి, నిధుల సమీకరణే ప్రధాన అజెండా
- అమరావతి, విభజన హామీలపై చర్చించే అవకాశం
- ఐటీ, విద్యా రంగాల విస్తరణపై ప్రత్యేక దృష్టి



**వార్త సంధ్య, అమరావతి, ఫిబ్రవరి 03 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు టీడీపీ ఎంపీలు విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక అభివృద్ధి పనులపై చర్చించేందుకు, నిధులు రాబట్టేందుకు ఆయన కేంద్ర మంత్రులతో వరుసగా సమావేశం కానున్నారు.ఈ రాత్రికి ఢిల్లీలోనే బస చేయనున్న లోకేశ్, బుధవారం పార్లమెంట్ భవనంలో పలువురు కేంద్ర మంత్రులతో కీలక భేటీలు జరపనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా రాష్ట్రంలో ఐటీ రంగం విస్తరణ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల ఏర్పాటు, విద్యారంగ సంస్కరణలు వంటి అంశాలపై చర్చించనున్నారు. వీటితో పాటు ఏపీ విభజన చట్టంలోని హామీల అమలు, అమరావతి రాజధాని నిర్మాణానికి నిధులు, కొత్త ప్రాజెక్టుల మంజూరు వంటి విషయాలపై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపనున్నారు.ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కేటాయించిన రాయితీలు, మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత శాఖల మంత్రులతో లోకేశ్ చర్చించనున్నారు. అలాగే, రాష్ట్రంలో పురోగతిలో ఉన్న రూ.92,649 కోట్ల పనుల వివరాలను - మిగతా 2 లో

# సంపాదకీయం

## దేశంలో విద్వేష విషం పెరుగుతోంది!



అమెరికాలోని వాషింగ్టన్ కేంద్రంగా నడుస్తున్న 'సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ ఆర్గనైజ్డ్ హేట్' అనే ఎన్జీవో సంస్థ భారతదేశంలో 2025 సంవత్సరంలో రాజకీయ నాయకులు చేసిన విద్వేష ప్రసంగాలపై అధ్యయనం చేసింది. 'ఇండియా హేట్ ల్యాబ్' పేరుతో తన నివేదికను ఇటీవలే విడుదల చేసింది. దీని ప్రకారం 2025లో దేశవ్యాప్తంగా 1,318 విద్వేష ప్రసంగాలు నమోదయ్యాయి. ఇందులో 1,164 ప్రసంగాలు బీజేపీ పాలిత రాష్ట్రాలలోనే నమోదయ్యాయిం. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ఢిల్లీ, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలో ఎక్కువగా నమోదయ్యాయి. ఇందులో 1,289 ప్రసంగాలు ముస్లింలను టార్గెట్ చేస్తూ, వందకు పైగా ప్రసంగాలు క్రిస్టియన్లను టార్గెట్ చేస్తూ ఇచ్చినవి. మొత్తం ప్రసంగాలలో 98శాతం ముస్లింలకు, 2శాతం క్రిస్టియన్లకు వ్యతిరేకంగా ఉన్నాయి. ఈ సంస్థ విడుదల చేసిన గత మూడేళ్ళ గణాంకాలను గమనిస్తే ప్రతి ఏటా విద్వేష ప్రసంగాల సంఖ్య రెట్టింపు అవుతూనే ఉన్నదని అర్థమవుతుంది. బీజేపీ నాయకులు వారి పార్టీ ర్యాలీలలో, మతపరమైన ఊరేగింపులలో, సాంస్కృతిక ర్యాలీలలో ఈ విద్వేష ప్రసంగాలు చేస్తున్నారు. తర్వాత, ఈ ప్రసంగాలను సోషల్ మీడియాలో బీజేపీ విస్తృతంగా ప్రచారం చేయిస్తోంది. ర్యాలీలలో పాల్గొన్న, సోషల్ మీడియాలో ఈ వీడియోలు చూసిన పేద, మధ్యతరగతి హిందువుల పిల్లలు మతపరమైన భావోద్వేగాలకు లోనవుతున్నారు. హద్దుమీరి మైనార్టీ ప్రార్థనా మందిరాలపైన, వ్యక్తులపైన దాడులు చేస్తూ, కేసులూ జైళ్ళ పాలై, జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఈ విష వలయాన్ని పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలి. ఎన్నికల సమయంలో ఈ విద్వేష ప్రసంగాలు తీవ్రస్థాయికి చేరుతున్నాయి. గత 12 ఏళ్లుగా బీజేపీ ప్రతి ఎన్నికను ప్రజా సమస్యలకు కేంద్రంగా కాకుండా, విభజన రాజకీయాలకు కేంద్రంగా మార్చుతూ వచ్చింది. ఓటర్లు భావోద్వేగంతో ఓటు వేసే పరిస్థితులను సృష్టించింది. ఇదే పద్ధతి కొనసాగితే దేశ ప్రజల భవిష్యత్తు అంధకారమే! విద్వేష ప్రసంగాలు చేసేవారిని శిక్షించడానికి ఇప్పటికీ ఒక ప్రత్యేక చట్టం లేదు. ఈ చట్టం రూపకల్పనకు సుప్రీంకోర్టు చొరవ చూపాలి. కేంద్ర ప్రభుత్వం గైడ్‌లైన్స్ రూపొందించేలా ఆదేశాలు ఇవ్వాలి. లేకపోతే ఈ విద్వేష పాలకుల విష ప్రసంగాలు ఆగవు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మార్గనిర్దేశకత్వంలో ఇటీవలే కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం విద్వేష ప్రసంగాలకు వ్యతిరేకంగా ఒక బిల్లును రూపొందించి అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. త్వరలోనే అది చట్టంగా మారే అవకాశం ఉంది. ఇదే స్ఫూర్తితో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ చట్టాన్ని రాష్ట్రంలో కూడా తీసుకొస్తామని ప్రకటించారు. దీనికి రాష్ట్రంలోని బీజేపీయేతర పార్టీలన్నీ మద్దతు తెలపాల్సిన అవసరం ఉంది. విద్వేష ప్రసంగాలకు తెలంగాణ కేంద్రంగా మారకుండా చూసుకోవలసిన బాధ్యత ఉద్యమకారులుగా మనందరి మీదా ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు. ప్రజల చైతన్యమే ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేస్తుంది. ఈ విద్వేష ప్రసంగాలు చేసే నాయకులను, విభజన రాజకీయాలను ప్రోత్సహించే రాజకీయ పార్టీలను వ్యతిరేకించాలి. ప్రజలలో ఈ స్థాయి చైతన్యానికి పౌర సమాజం, విద్యార్థి, యువజన సంఘాలు కృషి చేయాలి.

## ఢిల్లీలో చేరుకున్న నారా లోకేశ్

**మొదటిపేజీ తరువాయి** – కేంద్రం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది. హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై హై–స్పీడ్ రైల్వే కారిడార్ల అంశంపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశమయ్యే అవకాశం కూడా ఉంది. కీలక సమావేశాల అనంతరం బుధవారం రాత్రికి ఆయన తిరిగి ఉండవల్లిలోని నివాసానికి చేరుకోనున్నారు.

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం
## వ్యవసాయ ఉత్పత్తులపై కేంద్రం క్లారిటీ

**మొదటిపేజీ తరువాయి** – పాడి ఉత్పత్తులపై సుంకాలను తగ్గించేందుకు మొదటి నుంచి అంగీకరించడం లేదని స్పష్టం చేసింది. వాణిజ్య ఒప్పందం నేపథ్యంలోనూ అదే విషయాన్ని స్పష్టం చేశామని పేర్కొంది. వెనెజువెలా చమురు కొనుగోలు అంశం పరిశీలలో ఉందని తెలిపింది. ఆంక్షలు అమల్లో ఉన్నప్పుడు మనం వెనెజువెలా నుంచి చమురు కొనుగోలు చేయలేదని, ఇప్పుడు వాటిని ఎత్తివేశారని పేర్కొన్నారు. చమురు కొనుగోలు చేస్తామన్నారు. అమెరికా నుంచి వచ్చే వ్యవసాయ ఉత్పత్తులు చాలా తక్కువకు వస్తాయి. వాటిపై సుంకాలు తగ్గిస్తే మన దేశంలో రైతులపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇంతకాలం వాణిజ్య చర్చల ప్రతిష్ఠంభనకు ఇది ప్రధాన కారణం. మన రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి వాణిజ్యం ఒప్పందం కోసం కేంద్రం ఆసక్తి చూపలేదు. ఇప్పుడు వాణిజ్య ఒప్పందం కుదరడంతో వస్తున్న విమర్శలకు కేంద్రం స్పష్టతనిచ్చింది.

## హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుంది

**మొదటిపేజీ తరువాయి** – నిర్వీర్యం చేశారని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేయడం సరికాదని అన్నారు. ఈ పథకానికి బడ్జెట్‌లో 9 శాతం నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30 లక్షల ఇళ్లు కేటాయించామని, మేడారం జాతరకు కేంద్రం రూ.3.70 కోట్లు కేటాయించిందని అన్నారు. నైనీ బొగ్గు బొగ్గు గనుల వ్యవహారంలో తెలంగాణ మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ తన ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చుకుందని విమర్శించారు.

## మున్సిపల్ ఎన్నికల రెబల్స్‌కు జగ్గారెడ్డి గట్టి హెచ్చరిక



**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలకు కూడా రెబల్స్ బెడద తప్పడం లేదు. ఈ క్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ రెబల్స్ అభ్యర్థులకు హెచ్చరిక జారీ చేశారు. తనను, పార్టీ నిర్ణయాన్ని కాదని ఎవరైనా నామినేషన్ వేస్తే వారిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో అధికార కాంగ్రెస్ పార్టీకి ఎనిమిది వార్డుల్లో రెబల్స్ పోరు ఉంది. అయితే పార్టీ అధిష్ఠానం ఇప్పటికే అభ్యర్థులకు బీ–ఫామ్‌లు అందజేసింది. పోటీకి ఆసక్తి చూపుతున్న మిగిలిన అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకుని పార్టీ బీ–ఫామ్ ఇచ్చిన అభ్యర్థులకు సహకరించాలని జగ్గారెడ్డి సూచిస్తున్నారు.

# విచారణ కమిషన్‌కు కేబినెట్ గ్రీన్ సిగ్నల్



**మొదటిపేజీ తరువాయి** – అంశాలు, ప్రభుత్వానికి సమర్పించిన అంశాల్లో తేడాలను మంత్రివర్గం గుర్తించింది. విచారణలో ఉన్న వాస్తవాలు ఛార్జ్ షీట్‌లో ఎందుకు మిస్ అయ్యాయనే దానిపై ప్రధానంగా చర్చ జరిగింది. విచారణ అంశాలు, ఛార్జ్ షీట్‌లో అంశాలు, ప్రభుత్వ నివేదికలో తేడాలపై అధ్యయనం చేసి వాస్తవాలను సమర్పించేందుకు విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కమిటీ ఏర్పాటు చేసి నిర్ణీత కాలపరిమితిలో నివేదిక తెప్పించుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది. తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంలో నివ్వెరపోయే నిజాలు వెలుగు చూశాయని కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులు మీడియాకు వివరించారు. తప్పు జరుగుతోందని తెలిసినా నాటి పాలకులు మౌనంగా ఉన్నారని స్పష్టమవుతోందన్నారు. సిట్ నివేదికతో పాటు ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న సమాచారం పైనా సుదీర్ఘంగా చర్చించామన్నారు. తిరుమల లడ్డూలో పందికొవ్వు కలిసిందని ఎన్డీడీబీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారని పయ్యావుల గుర్తు చేశారు. బీఫ్ టాలో, లార్డ్, ఫిష్ ఆయిల్ లడ్డూకి వాడిన రసాయనాల్లో వాడినట్లు ఎన్డీడీబీ నిర్ధారించిందని వెల్లడించారు. తన వద్దకు వచ్చిన వాస్తవాలు సీఎం ప్రజల ముందు పెట్టాలా వద్దా అని ప్రశ్నించారు. ఎన్డీడీబీ నివేదిక తరహాలోనే లడ్డూలో రసాయనాల వాడకంపై 2022 వైఎస్సార్సీపీ హయాంలోనే సీఎఫ్టీఆర్ఐ నాటి ప్రభుత్వానికి ఇచ్చిందన్నారు. ఆ నివేదిక ఆధారంగా నాటి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా మరింత ప్రోత్సహించటాన్ని ఏమి అనాలని నిలదీశారు. చుక్క పాలు లేకుండా నెయ్యి అంటూ రసాయనాలు తయారు చేసిన విధానంపై ప్రజల్లో చర్చ జరగాలని పిలుపునిచ్చారు. ఫేక్ డాక్యుమెంట్స్ తో వైష్ణవి డెయిరీ నెయ్యి కొనుగోళ్లు టెండర్లలో పాల్గొంటోందని తెలిసి కూడా నాడు మౌనం వహించిన వారంతా నేరస్థులేనని వ్యాఖ్యానించారు. ఘోరమైన నేరంలో భాగస్వాములైన వారిపై చర్యలు తీసుకోవడం కోసమే విచారణ కమిటీ ఏర్పాటు చేస్తున్నామని తేల్చి చెప్పారు. తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంలో పారదర్శకత కోసమే ప్రభుత్వ ప్రయత్నం తప్ప రాజకీయ కోణం ఇందులో లేదు. తిరుమల శ్రీవారి పవిత్రత కాపాడే ప్రయత్నమే కూటమి ప్రభుత్వం చేస్తోంది.

తిరుమల లడ్డూలో కల్తీ జరిగింది కానీ జంతు కొవ్వు లేదన్నట్లు వైఎస్సార్సీపీ నేతల మాటలు ఉన్నాయి. లడ్డూలో కల్తీని వైఎస్సార్సీపీ సమర్థిస్తోందా? 250కోట్ల అవినీతి కోసం భక్తుల మనోభావాలతో ఆడుకున్నారు. హిందూ ధర్మం మూలలను దెబ్బతీసే విధంగా వైసీపీ చర్యలు ఉన్నాయి. అజెండా అంశాలు పక్కన పెట్టి మరీ కల్తీ లడ్డూ వ్యవహారంపైనే చర్చించాం. –పయ్యావుల కేశవ్, పార్థసారథి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, మంత్రులు

**గత ప్రభుత్వ హయాంలోనే కల్తీ :** వైఎస్సార్సీపీ హయాంలో టెండర్ నిబంధనల్ని సడలించటంతోనే కల్తీకి బీజం పడిందని కేబినెట్ అభిప్రాయపడింది. ఈవోగా ఉన్న సింఘాల్ సడలించిన నిబంధల్ని తిరస్కరించే విచక్షణాధికారం ఉన్నప్పటికీ ఆ దిశగా నిర్ణయం తీసుకోకపోవటాన్ని మంత్రివర్గం తప్పుబట్టింది. వైఎస్సార్సీపీ హయాంలో 2022లో చేయించిన సీఆర్టీఐ నివేదికలోనే కల్తీ నిర్ధారణ అయినా చర్యలు తీసుకోకపోవటాన్ని మంత్రివర్గం తప్పుబట్టింది. సిట్ నివేదికతోపాటు ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారంపై కేబినెట్ లోతుగా చర్చించింది. లడ్డూలో రసాయనాలు వాడకం అంశంలో విస్తుపోయే అంశాలు బయట పడుతున్నాయని మంత్రులు తెలిపారు. అడ్వకేట్ జనరల్‌ను మంత్రివర్గం కేబినెట్‌కు పిలిపించింది. సిట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా న్యాయపరంగా తీసుకోవాల్సిన చర్యలపై అడ్వకేట్ జనరల్‌తో చర్చించారు. నివేదికలోని ప్రతి అంశంపై లోతుగా మంత్రివర్గంలో చర్చించారు.

**మంత్రి పార్థసారథి వివరణ :** వైఎస్సార్సీపీ హయాంలో కొనుగోలు కమిటీలో తాను, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సభ్యులుగా ఉన్నా తమని సమావేశానికి కనీసం ఆహ్వానించలేదని మంత్రి పార్థసారథి క్యాబినెట్ దృష్టికి తీసుకొచ్చారు. తమను పిలవకపోగా కొనుగోలు కమిటీలో సభ్యులు కానీ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్న విషయాన్ని మంత్రివర్గానికి పార్థసారథి వివరించారు. ఈ కమిటీలో సభ్యులుగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కమిటీలో లేని కరుణాకర్‌రెడ్డిలు నిబంధనలు సడలించి కల్తీకి తెరలేపారని మంత్రివర్గం అభిప్రాయపడింది. కల్తీ రసాయనాలతో 20 కోట్ల లడ్డూలను తయారుచేసి పంపిణీ చేయటాన్ని తీవ్రంగా మంత్రివర్గం తప్పుబట్టింది. అయోధ్య రామమందిరానికి సైతం అవే కల్తీ లడ్డూలు సరఫరా చేయటాన్ని మంత్రివర్గం మహాపాపంగా తెలిపింది.

**మరింత సమాచారం :** సీఎం చంద్రబాబు కూటమి మంత్రులందరితో విడిగా భేటీ అయ్యారు. కేబినెట్ అజెండా అంశాలు పక్కన పెట్టి సమావేశమయ్యారు. సీఎంతో భేటీలో పవన్ కల్యాణ్, సత్యకుమార్, నారా లోకేశ్‌లు పాల్గొన్నారు. అజెండా అంశాలను పక్కన పెట్టి తిరుమల శ్రీవారి లడ్డూపై సిట్ ఇచ్చిన నివేదికపై చర్చించాలని నిర్ణయించారు.

**టర్నోవర్ రూ.150 కోట్లకు తగ్గింపు :** సిట్ ప్రభుత్వానికి రాసిన 14 పేజీల లేఖలోని చివరి పేరాలో కల్తీ నెయ్యి సరఫరాకు సంబంధించి అప్పట్లో ఉన్నత స్థానాల్లో ఉన్న ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకోవాలని సూచించింది. నెయ్యి సరఫరాకు ఉన్న నాణ్యతా ప్రమాణాలను బలహీనపరిచేలా వ్యవహరించారని, నిబంధనల తయారీలో మనసు పెట్టకుండా పనిచేశారని పేర్కొంది. దీనివల్ల నెయ్యి నాణ్యతలోనూ రాజీ జరిగిందని తెలిపింది. తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యి సరఫరాకు 2019 ముందున్న కఠిన నిబంధనలను వైఎస్సార్సీపీ అధికారంలోకి రాగానే మార్చేశారు. టెండర్లలో పాల్గొనే డెయిరీలు పాలు సేకరించాల్సిన అవసరం లేదని, వెన్న సేకరణ, నెయ్యి ఉత్పత్తి సామర్థ్యంతో పని లేదని సడలించారు. మూడేళ్లపాటు కార్యకలాపాలు నిర్వహించాలనే నిబంధనకు మినహాయింపు ఇచ్చారు. టర్నోవర్ మొత్తాన్ని రూ. 250 కోట్ల నుంచి రూ.150 కోట్లకు తగ్గించారు.

# నెయ్యి కల్తీపై ఏపీ కేబినెట్ సీరియస్

**మొదటిపేజీ తరువాయి** – నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ మీడియా సమావేశంలో కేబినెట్ చర్చల వివరాలను వెల్లడించారు. ఈ అంశంపై రాజకీయ ప్రయోజనాలు ఆశించడం లేదని, కేవలం భక్తుల మనోభావాలను గౌరవిస్తూ, శ్రీవారి క్షేత్ర పవిత్రతను పునరుద్ధరించడమే తమ లక్ష్యమని మంత్రులు స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహా మంత్రులందరూ ఈ అంశంపై తమ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడించారని తెలిపారు.

**కొలుసు పార్థసారథి ఏమన్నారంటే..**

మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ, "కోట్లాది మంది హిందువులు ఆరాధించే ఏడుకొండలవాని సన్నిధిలో జరిగిన ఈ మహాపాపం గురించి సీబీఐ ఇచ్చిన నివేదికపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. హిందువుల మనోభావాలను, తిరుమల పవిత్రతను కాపాడటానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై మంత్రులందరూ అభిప్రాయాలు తెలిపారు. సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసినప్పటికీ, కోర్టు ఇంకా కాగ్నిజెన్స్‌లోకి తీసుకోలేదు. అయితే, గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ తప్పిదాలను సరిదిద్దేందుకు, బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది," అని అన్నారు.

**పయ్యావుల కేశవ్ వివరణ..**

ఈ వ్యవహారంలోని సాంకేతిక, చట్టపరమైన అంశాలను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వివరించారు. "సీబీఐ నుంచి ప్రభుత్వానికి 11 పేజీల నివేదిక అందింది. ఇందులో గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఉద్దేశపూర్వక తప్పిదాలను స్పష్టంగా పేర్కొన్నారు. ఎన్‌డీబీ–సీఏఎల్ఎఫ్ ఇచ్చిన ల్యాబ్ రిపోర్ట్ ప్రకారం నెయ్యిలో సోయాబీన్, ఫిష్ ఆయిల్, బీఫ్ టాలో (జంతు కొవ్వు), లార్డ్ వంటివి ఉండే అవకాశం ఉందని (సస్పెక్టెడ్ అడల్టరెంట్స్) తేలింది. ఈ నివేదిక ఆధారంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆనాడు ఆరోపణలు చేశారు" అని కేశవ్ తెలిపారు. "2022లోనే సీఎఫ్‌టీఆర్ఐ రిపోర్టులో కల్తీ జరిగిందని తేలినా, నాటి టీటీడీ అధికారులు, పాలకమండలి చైర్మన్ దానిని తొక్కిపెట్టారు. గతంలో చంద్రబాబు హయాంలో నెయ్యి కొనుగోలుకు కఠిన నిబంధనలు పెట్టారు. కానీ, వైసీపీ ప్రభుత్వం వచ్చాక కేవలం ఐదు నెలల్లోనే ఆ నిబంధనలను ఉద్దేశపూర్వకంగా సడలించారు. పాలు సేకరించే సామర్థ్యం లేని సంస్థలకు, టర్నోవర్ తగ్గించి, అనుభవం లేని సంస్థలకు టెండర్లు కట్టబెట్టారు. బోలే బాబా వంటి సంస్థలకు టెండర్ దక్కించుకోవడానికి వైవీ సుబ్బారెడ్డి పీఏ ప్రయత్నించినట్లు కూడా ఆరోపణలున్నాయి. ఫేక్ డాక్యుమెంట్లతో టెండర్లలో పాల్గొన్నా అధికారులు అడ్డుకోలేదు. ఈ తప్పులన్నింటికీ నాటి ఈవో అనిల్ కుమార్ సింఘాల్, ఏఈవో ధర్మారెడ్డి, సీఏవో బాలాజీ బాధ్యులని సీబీఐ నివేదికలో పేర్కొంది. వారిపై చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది," అని పయ్యావుల కేశవ్ వివరించారు.

**నాదెండ్ల మనోహర్ స్పందన..**

మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, ఈ అంశంలో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తామని చెప్పారు. "కేబినెట్ సమావేశానికి అడ్వకేట్ జనరల్‌ను కూడా ఆహ్వానించి న్యాయపరమైన సలహాలు తీసుకున్నాం. భక్తుల మనోభావాలతో ఆడుకున్న వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. 2022లో కల్తీ రిపోర్ట్ వచ్చాక, గత ప్రభుత్వం ఒక్కసారి కూడా నెయ్యి శాంపిల్స్‌ను టెస్టుకు పంపలేదు. ఎందుకంటే అందులో అసలు నెయ్యే లేదు. కానీ, మా కూటమి ప్రభుత్వం వచ్చాక 12 నుంచి 15 సార్లు నాణ్యతా పరీక్షలు చేయించాం. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నదే మా ప్రభుత్వ ఉద్దేశం" అని స్పష్టం చేశారు.

**సత్యకుమార్ యాదవ్ ఆరోపణలు.. :** మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, వైసీపీ నాయకత్వం హిందూ ధర్మం మూలాలనే దెబ్బతీసే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. "కల్తీ జరిగిందని వైసీపీ నేతలే ఒప్పుకుంటున్నారు. అంటే, శ్రీవారి ప్రసాదంలో కల్తీని సమర్థిస్తున్నారా? అసలు పాలు లేకుండా నెయ్యి ఎలా తయారు చేస్తారు? రూ.250 కోట్ల అవినీతి కోసం కోట్లాది మంది భక్తుల విశ్వాసాలను దెబ్బతీశారు. గతంలో తిరుమలలో ఏడు కొండలకు బదులు రెండే ఉన్నారని వాదించడం, అన్యమత ప్రచారాన్ని ప్రోత్సహించడం, డిక్లరేషన్ ఇవ్వకుండా దర్శనాలు చేయడం వంటి చర్యలతో ఆలయ పవిత్రతను మంటగలిపారు. ఈ బోలే బాబా డైరీని దొడ్డిదారిన తెచ్చిన అలీబాబా ఎవరో, దాని వెనకున్న 40 దొంగలు ఎవరో ప్రజలకు తెలియాలి," అని సత్యకుమార్ యాదవ్ ఘాటుగా విమర్శించారు.

# భారత రక్షణ రంగంలో మరో కీలక ముందడుగు

**మొదటిపేజీ తరువాయి** – భారత రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) మరో కీలక విజయాన్ని అందుకుంది. సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ్ రామ్‌జెట్ (ఎస్ఎఫ్‌డీఆర్) టెక్నాలజీని ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) నుంచి విజయవంతంగా ప్రదర్శించింది. ఈ పరీక్షతో సుదూర గగనతల క్షిపణుల తయారీలో భారత్ స్వయంసమృద్ధి దిశగా మరో ముందడుగు వేసినట్లయింది. మంగళవారం ఉదయం 10:45 గంటల సమయంలో ఈ పరీక్షను నిర్వహించారు. ముందుగా గ్రౌండ్ బూస్టర్ సాయంతో క్షిపణి వ్యవస్థను నిర్దేశిత వేగానికి చేర్చారు. ఆ తర్వాత, నాజిల్–లెస్ బూస్టర్, రామ్‌జెట్ మోటార్ వంటి అన్ని ఉప వ్యవస్థలు ప్రణాళిక ప్రకారం అత్యంత కచ్చితత్వంతో పనిచేశాయి. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఐటీఆర్‌లో ఏర్పాటు చేసిన ట్రాకింగ్ వ్యవస్థల ద్వారా నమోదు చేసి, ధృవీకరించారు. ఈ అత్యాధునిక టెక్నాలజీ విజయవంతం కావడంతో భారత్‌కు గగనతలంలో గణనీయమైన వ్యూహాత్మక ప్రయోజనం లభించనుంది. శత్రు విమానాలను చాలా దూరం నుంచే అడ్డుకునే సామర్థ్యం భారత వాయుసేనకు అందుబాటులోకి వస్తుంది. దీంతో ఈ పరిజ్ఞానం కలిగిన కొద్ది దేశాల సరసన భారత్ చేరింది. డీఆర్‌డీవోకు చెందిన డీఆర్‌డీఎల్, హెచ్‌ఈఎంఆర్ఎల్, ఆర్‌సీఐ వంటి ప్రయోగశాలలు సంయుక్తంగా ఈ పరీక్షను నిర్వహించాయి. ఈ ప్రయోగం విజయవంతం కావడం పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్‌డీవో శాస్త్రవేత్తలను, సంబంధిత పరిశ్రమలను అభినందించారు. ఇది భారత రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.



# లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తత



**మొదటిపేజీ తరువాయి** – పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సభలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి, నిరసన పేరుతో కాగితాలను చింపి స్పీకర్ ఛైర్ వైపు విసిరారన్న కారణంతో 8 మంది కాంగ్రెస్ ఎంపీలను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేశారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని స్పీకర్ ప్యానెల్ ఆఫ్ ఛైర్ పర్సన్స్ లో ఒకరైన దిలీప్ సైకియా (ప్యానెల్ స్పీకర్) ప్రకటించారు. సస్పెన్షన్ వేటు పడిన వారిలో అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మాణికం ఠాగూర్, గురుజీత్ సింగ్ ఆజులా, హిబి ఈడెన్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రశాంత్ యాదవరావు పడోలే, ఎస్.వెంకటేశన్, డీన్ కురియకోస్ ఉన్నారు. "ప్రతిపక్షాలకు తమ గళం వినిపించే హక్కు ఉంది, కానీ నిరసన పేరుతో సభను పూర్తిగా స్తంభింపజేయడం, ప్రొసీడింగ్స్ జరగకుండా అడ్డుకోవడం పార్లమెంటరీ సంప్రదా యాలకు విరుద్ధం" అని దిలీప్ సైకియా వ్యాఖ్యానించారు. అంతకుముందు, సరిహద్దుల్లో చైనా ఆక్రమణల అంశంపై చర్చించాలంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన పుస్తకానికి సంబంధించిన ఓ మ్యాగజైన్ కథనాన్ని రాహుల్ ప్రస్తావించారు. అయితే, ధృవీకరించని వార్తా కథనాలను సభలో చదవకూడదని ప్యానెల్ స్పీకర్ సైకియా అభ్యంతరం తెలపడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రాహుల్ స్పందిస్తూ.. "మాట్లాడ టానికి నాకు ఎవరి అనుమతి అవసరం లేదు. నేను ప్రతిపక్ష నాయకుడిని.. నాకు పర్మిషన్ అనే పదం వాడటం సరికాదు" అని మండిపడ్డారు. తూర్పు లడఖ్‌లో ఘర్షణల వల్ల భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారని, దీనిపై ప్రధాని స్పందన ఏమిటని రాహుల్ ప్రశ్నించారు. ఈ సమయంలోనే అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగింది. విపక్ష సభ్యులు వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. గందరగోళం మధ్యే సస్పెన్షన్ తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేశారు. టీడీపీ ఎంపీ జి.ఎం. హరీశ్ బాలయోగి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ, సభలో నిరసనల హోరు తగ్గకపోవడంతో ప్రసంగం కొనసాగలేదు.

# మేడారం జాతర విజయవంతం



**మొదటిపేజీ తరువాయి** – ములుగు జిల్లాలో ఇటీవల నిర్వహించిన మేడారం జాతర విజయవంతమైందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. సెక్రటేరియట్‌లో విలేకర్లతో మంత్రి సీతక్క ఇష్టాగోష్టిగా మాట్లాడారు. జాతర పనులు, గుడి పనులు సజావుగా జరిగాయని సంతోషం వ్యక్తం చేశారు. కొంత మంది జాతరతోపాటు ఏర్పాట్లపై విష ప్రచారం చేశారంటూ మండిపడ్డారు. ఎక్కడా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాతర ముగిసిందని పేర్కొన్నారు. ఒక దొంగతనం ఘటనపై కొందరు తప్పుడు ప్రచారం చేశారని వివరించారు. ఒకట్రెండు రోజుల్లో 'తిరుగు జాతర' జరుగుతుందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ఈ జాతర ఏర్పాట్లు బాగున్నాయని ప్రశంసించారని మంత్రి సీతక్క వివరించారు. క్లాస్, మాస్‌తోపాటు ఉన్నత స్థాయి వర్గాల వారు సైతం ఈ జాతరకు భారీగా తరలివచ్చారని చెప్పారు. సుమారు రెండున్నర కోట్ల మంది భక్తులు ఈ మేడారం జాతరకు వచ్చినట్లు భావిస్తున్నామన్నారు. వచ్చే జాతర సమయానికి మేడారం పరిసర ప్రాంతాల్లోని రహదారులను వెడల్పు చేసి.. ట్రాఫిక్ జామ్‌లను నివారిస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల కోసం ములుగు జిల్లా పరిధిలో పనులపై అధికారులతో సమీక్షిస్తామని ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## తిరువూరులో పట్టాదార్ పాస్‌బుక్స్ పంపిణీ రేషన్ షాప్, రైస్ మిల్లులపై ఆర్డీవో మాధురి ఆకస్మిక తనిఖీలు



**తిరువూరు ఫిబ్రవరి 03: (వార్తసంధ్య) :** ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరు మండలం లక్ష్మీపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో) మాధురి ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు పట్టాదార్ పాస్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ వై. నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాధురి రైతులతో మాట్లాడుతూ, తమ భూముల వివరాలు పట్టాదార్ పాస్‌బుక్స్‌లో సక్రమంగా నమోదు అయ్యాయా లేదా మరోసారి పరిశీలించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ పట్టాదార్ పాస్‌బుక్స్ రైతులకు భూ హక్కుల భద్రత కల్పించడంలో కీలకమని, వాటి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం లక్ష్మీపురం గ్రామంలో ఉన్న మామిడి రోశయ్య చౌక ధరల దుకాణం నెం. 0613031ను ఆర్డీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ సరుకుల నిల్వలు, పంపిణీ విధానం, రికార్డులను పరిశీలించి నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహించాలంటూ సూచనలు ఇచ్చారు. తదుపరి గ్రామంలో ఉన్న విజయ వెంకటేశ్వర అగ్రో ఇండస్ట్రీస్ (రైస్ మిల్)ను కూడా ఆర్డీవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ, రికార్డుల నిర్వహణను పరిశీలించి ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే తగిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ తనిఖీలలో తహసీల్దార్ తిరువూరు వై. నాగమణి, పీడీఎస్ డీటీ శ్వేత పాల్గొన్నారు.

## ఎరుకోపాడు పాఠశాలకు ఎస్బీఐ కంప్యూటర్ బహుకరణ



**తిరువూరు ఫిబ్రవరి:(వార్తసంధ్య) :** తిరువూరు మండల పరిధిలోని ఎరుకోపాడు గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (పీఎం శ్రీ స్కూల్) విద్యార్థుల విద్యా అవసరాలను దృష్టిలో ఉంచుకొని సామాజిక సేవా దృక్పథంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తిరువూరు శాఖ వారు మంగళవారం పాఠశాలకు కంప్యూటర్‌ను బహుకరించారు. డిజిటల్ విద్యను ప్రోత్సహించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో భారతీయ స్టేట్ బ్యాంక్ తిరువూరు శాఖ చీఫ్ మేనేజర్ దాసరి నాగన్న క్యాష్ ఆఫీసర్ బి.ఎల్.హెచ్. ప్రసాద్ పాల్గొని పాఠశాలకు కంప్యూటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం. సాంబశివరావు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడం ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడే విధంగా సహకారం అందించిన ఎస్బీఐ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ అండర్ - 17 హాకి క్రీడలలో ఎంపికైన లింగాపురం అమ్మాయి తడికల భవిత ని సన్మానించిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు.



**బూర్గంపహాడ్ , ప్రతినిధి , ఫిబ్రవరి 03 ( వార్త సంధ్య ) :** భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో అండర్ – 17 హాకి క్రీడలలో ఎంపికైన లింగాపురం అమ్మాయి తడికల భవిత ని సన్మానించిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు. చర్ల మండలం లింగాపురం గ్రామానికి చెందిన హాకీలో తన ప్రతిభను కనబర్చిన నేషనల్ అండర్ 17 కి ఎంపికైన సందర్భంగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శాలువాతో సత్కరించి అభినందించారు. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న తడికల భవిత క్రీడాల పట్ల ఆసక్తితో ఉన్న భవిత ఇంకా క్రీడల్లో విజయాలు సాధించాలని , వారికి భరోసానిస్తానని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు...

## రాజమండ్రి సెంట్రల్ జైలులో అంబటి రాంబాబును కలిసిన గారితో ముద్రగడ పద్మనాభం భేటీ..!

- కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలన పై నిరంతర పోరాటమే..

- తిరుమల లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ లు చేసిందంతా దుష్ప్రచారమే..



**అన్నమయ్య జిల్లా ప్రతినిధి – ఫిబ్రవరి 02 ( వార్త సంధ్య ) :**రాజమండ్రి సెంట్రల్ జైల్ లో రిమాండ్ లో ఉన్న అంబటి రాం బాబును మంగళవారం మాజీ మంత్రి బీసీ నాయకుడు ముద్రగడ పద్మనాభం, మాజీ మంత్రి మోదుగుల వేణుగోపాల కృష్ణ, మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వారి వెంట పలువురు వైసీపీ శ్రేణులు పరామర్శించారు. ఆయనను కలిసి నుంచి వెలుపల వచ్చాక మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలన పై నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామని ఆ పోరాటంలో వెనుకంజ వేసే ప్రసక్తే లేదని అంబటి రాంబాబు తమతో చెప్పారని ముద్రగడ పద్మనాభం స్పష్టం చేశారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ లు చేసిందంతా దుష్ప్రచారమేనని సీబీఐ నివేదిక స్పష్టం గా చెప్పిన వైనాన్ని ప్రజలకు వివరిస్తున్నందుకే తనపై తప్పుడు కేసులు బనాయించారని అంబటి రాంబాబు తన ఆవేదనను తమతో చెప్పుకున్నారని ముద్రగడ చెప్పారు. ఇలాంటి అక్రమ కేసులు, గూండాల దాడులు తమ సంకల్పాన్ని దెబ్బతీయలేవని, చంద్రబాబు దుష్ట పరిపాలనను ప్రజలకు వివరించి వారిని చైతన్యవంతులను చేస్తామని ముద్రగడ, వేణుగోపాల కృష్ణ, తోట త్రిమూర్తులు, జక్కంపూడి రాజా గారు స్పష్టం చేశారు..

## టేకులపల్లి మండలంలోని పలు గ్రామాలలో నాటు సార పట్టివేత.



**టేకులపల్లి ,ప్రతినిధి ఫిబ్రవరి 3 (వార్త సంధ్య):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం లోని పలు గ్రామాలలో కొత్తతండా, బొమ్మనపల్లి తండా, బిల్లుడుతండా, లచ్యతండా, టేకులపల్లి గ్రామాల్లో కొత్తగూడెం జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ టీం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీ లో ఎక్సైజ్ ఎస్ఐ గౌతమ్ మాట్లాడుతూ.. టేకులపల్లి మండలంలో చేపట్టిన సోదాల్లో 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని, భూక్యా ఉష, లావుడ్య అంకి అనే మహిళలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సోదాల్లో సిబ్బంది వెంకట నారాయణ, గురవయ్య, సుమంత్, పార్థసారధి పాల్గొన్నారు.

# కనివిని ఎరుగని రీతిలో ఆరంభమైన శ్రీశ్రీశ్రీ నల్ల వీర గంగాభవాని అమ్మవారి జాతర..

ముఖ్య అతిథులుగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్న - పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి, నిస్సార్ అహ్మద్



**అన్నమయ్య జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 03 ( వార్త సంధ్య ) –** మదనపల్లె కేంద్రమైన సమీపంలోని సీటీఎం లో కనివిని ఎరుగని రీతిలో నల్లవీర గంగమ్మ జాతర ఆరంభమైంది. ఆంధ్ర రాష్ట్రంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన గ్రామదేవత ఉత్సవం ఇది. సుమారు ఐదు వందల ఏళ్లుగా జరుగుతున్న ఈ జాతరలో భాగంగా గ్రామ వైసీపీ శ్రేణుల ఆహ్వానం మేరకు తొలి నాడు ముఖ్య అతిథులుగా తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి, మదనపల్లి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ లు విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని పునీతులయ్యారు. సిద్ధుల భుక్తి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర నలుమూలల నుంచి విశేషంగా భక్తాదులు వేలాది మంది పాల్గొనే ఈ జాతర కనువిందు చేయనుంది. అమ్మవారి జాతర విశిష్టతను ఆలయ పూజారులు వివరిస్తూ సుమారు నాలుగు సంవత్సరాల క్రితం గ్రామాలను కలరా వంటి వ్యాధులు పీడిస్తున్న నేపథ్యంలో ఎంతో మంది అసువులు బాసారు. ఆ వ్యాధుల నివారణకు ప్రతీకగా అమ్మవారి జాతర ప్రారంభమైందని గ్రామస్తులంతా ఏకమై అమ్మవారిని నియమ నిష్ఠలతో భక్తిశ్రద్ధలతో కొలుస్తూ వేడుకున్నారు. అంతే తడవుగా గ్రామంలో ఎలాంటి రోగ వ్యాధులు లేకుండా అమ్మవారు కాపాడారని విశ్వాసం. అప్పటి నుంచి కోర్కెలు తీర్చే అమ్మవారిగా నల్లవీర గంగమ్మను విశేష భక్తితో కొలుస్తారని ఆలయ పూజారులు వెల్లడించారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి అనంత అనుగ్రహంతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఎలాంటి రోగ పీడిత వ్యాధులు లేకుండా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో పలు అమ్మవార్లకు చెందిన జాతర వేడుకలు ఆయా గ్రామస్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తారని ఆనాటి నుంచి వస్తున్న ఆనవాయతి ఈనాటి వరకు కొనసాగుతుండడం హర్షణీయమన్నారు. నల్ల వీర గంగాభవాని అమ్మవారి కృపాకటాక్షాలతో ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో, సుఖసంతోషాలతో సమృద్ధిగా మెలగాలని ద్వారకానాథ్ రెడ్డి, నిస్సార్ అహ్మద్ లు ప్రార్థించారు.యువజన విభాగం అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి అమ్మవారిని వేడుకుంటూ జాతర సందర్భంగా నలు రాష్ట్రాల నుంచి ఆలయానికి తరలివచ్చే భక్తులకు అమ్మ వారి ఆశీస్సులు కలగాలని కోరుకుంటూ భక్తాదులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆనంద్ పార్థ సారథి, యువజన విభాగం అధ్యక్షులు హర్ష వర్ధన్ రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు బండపల్లి ఆక్కులప్ప, పెద్ద ఎత్తున వైసీపీ శ్రేణులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

## వైభవంగా చేలో శ్రీ ముత్యాల అమ్మవారు 18 వ వార్షికోత్సవం

7000 మంది కి భారీ అన్న సమారాధన కార్యక్రమం

అమ్మవారి ఆలయానికి విద్యుత్, సరైన రోడ్డు సదుపాయం లేక భక్తులుకు, ప్రజలుకు, రైతులు కు అవస్థలు





**తాడేపల్లిగూడెం, ఫిబ్రవరి 3 (టుడేస్ న్యూస్) :** పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణ యాగర్లపల్లి ప్రాంతంలో పచ్చని పొలాలు మధ్యలో 100 సంవత్సరాలు పైబడి కొలువై ఉన్న చేలో శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి 18వ వార్షికోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా ఏడువేల మంది కి భారీ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు పట్టణంలోని భాగ్యలక్ష్మి పేట ముత్యాలమ్మ నగర్ ముదునూరుపాడు అలాగే జట్లపాలెం, పెంటపాడు, పడాల, గ్రామ ప్రాంతానికి మధ్యలో 250 ఎకరాల పచ్చని పొలాలు మధ్యలో అమ్మవారు కొలువై ఉన్నారు నిత్య



పూజలు అందుకుంటూ మంచి ప్రాచుర్యం చెందారు అమ్మను దర్శించుకుని కోర్కెలు కోరుకుంటే అనుకున్న కోరికలు తీరతాయని ఈ ప్రాంత వాసుల నమ్మకం అయితే ఇంతటి ప్రాచుర్యం ఉన్న అమ్మవారి ఆలయానికి వెళ్లాలంటేనే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వర్షాకాలం అయితే ఆ బాధలు వర్ణనాతీతమని భక్తులు ప్రజలు రైతులు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ కనీసం అమ్మ ఆలయానికి విద్యుత్ సౌకర్యం లేదని ముదునూరుపాడు పుంతలో ముసలమ్మ ఆలయం ప్రక్క రోడ్డు నేరుగా ఈ ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణం ఆనుకుని పుంత రోడ్డు యాగర్లపల్లి కు కలుస్తుందని దయచేసి ప్రభుత్వ విప్ స్థానిక శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ఆలయానికి కరెంటు సమస్యను రోడ్డు సమస్యను పరిష్కరించవలసిందిగా వారు కోరుకున్నారు అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీ వారి పుంత రోడ్లు అభివృద్ధి లో భాగంగా ఈ పుంత రోడ్డును అభివృద్ధి చేస్తే ఇటు ఆలయ అభివృద్ధి అటు రైతులకు వ్యవసాయం చేసుకొనడానికి ఉత్పత్తులను తరలించడానికి సౌకర్యం కల్పించిన వారు అవుతారని తెలియజేశారు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఈ సమస్యను అతి త్వరలో పరిష్కారం చేయాలని ఆలయ కమిటీ సభ్యులతో పాటు స్థానిక ప్రజలు భక్తులు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొంది అన్న సమారాధన కార్యక్రమంలో స్వయంగా భక్తులకు అన్న వితరణ చేశారు ఈ కార్యక్రమంలో శ్రీధర్ తో పాటు తెలుగుదేశం పార్టీ 18 వార్డు ముదునూరు పాడు ఇంచార్జ్ బేతిరెడ్డి ఉదయ వెంకట భాస్కర్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు బేతిరెడ్డి అమ్మిరెడ్డి, వెలగల సర్నారెడ్డి ,మేడపాటి గురెడ్డి, ద్వారంపూడి వేణుగోపాల్ రెడ్డి, ఆకుల సుబ్బయ్య, హనుమంతు కుమార్, వెలగల అవినాష్ రెడ్డి , సత్తి జగదీశ్ రెడ్డి, చల్లా శివ భక్తులు ప్రజలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పిటిఎం మండలంలో కలకలం..

- గంజాయి విక్రయిదారుల అరెస్ట్..
- వారి వద్ద నుంచి 10 లక్షల విలువైన 10 కేజీల గంజాయి స్వాధీనం..
- ఐదుగురి అరెస్ట్..



**అన్నమయ్య జిల్లా ప్రతినిధి – ఫిబ్రవరి 03 ( వార్త సంధ్య ) –** అన్నమయ్య జిల్లాలో గంజాయి విక్రయాలు గుట్టు చప్పుడు కాకుండా లావాదేవీలు కొన సాగుతున్నాయి. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి గంజాయి పై ఎంత ఉక్కు పాదం మోపిన ఎక్కడో ఒకచోట లభ్యమవుతోంది. గంజాయిని అరికట్టాలని జిల్లా ఎస్పీ ఎంతో శ్రమిస్తున్నా కూడా కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. తాజాగా గంజాయి అమ్మకానికి పాల్పడుతున్న ముఠాను బి. కొత్తకోట పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. మదనపల్లి జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు డీఎస్పీ మహేంద్ర పర్యవేక్షణలో సిబ్బంది ఏకధాటిగా దాడులు నిర్వహించారు. ముఠా వద్ద నుంచి పెద్ద మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపిన వివరాల మేరకు పిటిఎం మండల కేంద్రమైన మల్లెల గ్రామ పంచాయితీ పెద్దమేకలపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణరెడ్డి పొలంలో పండిస్తున్న గంజాయిని బి. కొత్తకోట సురేంద్ర అలియాస్ డిమ్మర్, అఫ్రీద్, పురుషోత్తం, ఆదిల్ ముఠాగా ఏర్పడి విక్రయిస్తుండగా 10లక్షల గంజాయిని సీజ్ చేసి, ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని ఎస్పీ మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ పీటీఎం మండల కేంద్రమైన మల్లెల గ్రామానికి చెందిన వెంకటరమణారెడ్డి అనే వ్యక్తి తన పొలంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సాగు చేస్తున్నాడని గంజాయి విక్రయించేందుకు కొంత మంది యువకులకు డబ్బు ఆశ చూపి మార్కెట్ లోకి తరలిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారని గుర్తుతెలియని వ్యక్తుల నుంచి సమాచారం అందడంతో ముఠా సభ్యుల కదలికను బి.కొత్తకోట పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి గంజాయి విక్రయదారుల గుట్టు రట్టు చేశారని జిల్లా ఎస్పీ వెల్లడించారు. సురేంద్ర, అఫ్రీద్, పురుషోత్తం, ఆదిల్ అనే యువకుల ద్వారా మార్కెట్లోకి వెంకటరమణారెడ్డి సరఫరా చేసేవాడని వీరి కదలికను ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన బి. కొత్తకోట పోలీసులు ముఠా సభ్యులను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారని ఎస్పీ తెలిపారు. "యువత భవిష్యత్తును చిన్నాభిన్నం చేసే మత్తు పదార్థాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని సాగు చేసినా, అమ్మినా జైలు శిక్ష తప్పదని ఎస్పీ హెచ్చరించారు. ఈ గంజాయి దాడిలో ప్రతిభ కనబరిచిన మదనపల్లి డిఎస్పీ మహేంద్ర, బి.కొత్తకోట సీఐ గోపాల్ రెడ్డి, క్రైమ్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్ పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించారు..

## జేఏసీ సదస్సును జయప్రదం చేయండి

కార్మిక సంఘాల జేఏసీ పిలుపు.



**టేకులపల్లి, ప్రతినిధి ఫిబ్రవరి 3 : (వార్త సంధ్య):** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడలు రద్దు చేయాలని నూతన వ్యవ సాయ చట్టాలను నూతన విద్యుత్ బిల్లును ఉపసాగించుకోవాలని తదితర డిమాండ్లతో ఫిబ్రవరి 12న జరుగు దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఫిబ్రవరి 6 న టేకులపల్లి జేఏసీ ఆధ్వర్యంలో జరుగు సదస్సును జయప్రదం చేయాలని జేఏసీ నాయకులు డి .ప్రసాద్ , కడుదుల వీరన్న, జరుపుల సుందర్ ,గుగులోత్ రామచందర్, కోరారు మంగళవారం టేకులపల్లి లో జరిగిన జేఏసీ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గం అనేక త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి పారిశ్రామికవేత్తలకు బడా పెట్టుబడిదారులకు లబ్ధి చేకూర్చే విధంగా నాలుగు లేబర్ కోడులను తీసుకొచ్చి దేశ కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే కోడులను ఉపసంహరించుకొనే వరకు కార్మిక వర్గం ఉద్యమించాలని పిలుపునిచ్చారు ఈ పిలుపులో భాగంగా ఈ 6న జరుగు సదస్సుకు సింగరేణి గ్రామపంచాయతీ హమాలీ మిషన్ భగీరథ ఆశ అంగన్వాడి మధ్యాహ్న భోజన కార్మికులు ఇంకా తదితర సంఘటిత అ సంఘటిత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోడ మంచ జినక ప్రసాద్ అయిత శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## లండన్ ట్రినిటీ కాలేజీలో భద్రాద్రి "శృతిలయ" విద్యార్థుల ఘనవిజయం

అభినందించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**భద్రాద్రి, ఫిబ్రవరి 03(వార్త సంధ్య) :** శృతిలయ స్కూల్ అఫ్ మ్యూజిక్ 16వ బ్యాచ్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో తమ ప్రతిభను చాటారు. ప్రపంచ ప్రతిష్టత్మక మైన ట్రినిటీ కాలేజ్ లండన్ నుండి విడుదలైన వెస్ట్రన్ సంగీత వివిధ గ్రేడ్స్ వ్రాత పరీక్ష ఫలితాలలో రాష్ట్ర స్థాయి ర్యాంకులతో పాటు 100% పాస్ ఫలితాలను సాధించిన విద్యార్థిని విద్యార్థులను అభినందిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం నాడు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ అఫ్ స్కూల్స్ చైర్మన్ & డైరెక్టర్ కె. ఏలియా, సలహాదారులు ఏం సత్యనారాయణ రాజు వారి పిల్లలకు మరియు తల్లిదండ్రులకు అభినందనలను తెలియజేశారు.

## ఆయుర్వేదిక్ హాస్పిటల్ సేవలను వెంటనే అందించాలి

### సేవల అందే వరకు పోరాటాలు చేస్తాం జేపీసీ చెలిమప్ప



**వార్త సంధ్య ప్రతినిధి అనంతపురం :** కళ్యాణ్ దుర్గం మండలం పరిధిలో ఉన్న గోళ్ళ ఆయుర్వేదిక్ హాస్పిటల్ ను తరలించిన విషయంపై గోళ్ళ గ్రామ ప్రజలు దళిత సంఘాల పోరాటాలు చేయడంతో అధికారుల దిగవచ్చి గోళ్ళ గ్రామంలోనే ఆయుర్వేదిక్ సేవలు యధావిధిగా కొనసాగించి సేవలందిస్తామని చెప్పి రెండు నెలలు కావస్తున్నా ఆయుర్వేదిక్ సేవలు ఇంతవరకు అందించడం లేదని ఎందుకు ఆలస్యం జరుగుతున్న విషయంపై ఈరోజు కళ్యాణదుర్గం ఏవో ఎస్సీ ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలమప్ప ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది తరలించిన ఆయుర్వేదిక్ హాస్పిటల్ గోళ్ళ గ్రామంలోనే సేవల అందించే విధంగా చర్యలు తీసుకున్నామని చెప్పిన అధికారులే ఇంతవరకు ఎందుకో సేవలు ప్రారంభానికి నోచుకోలేదు అని వెంటనే ఆయుర్వేదిక్ సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో గోళ్ళ గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ జేఏసీ మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గోళ్ళు ఆయుర్వేదిక్ హాస్పిటల్ ముందర ధర్నా కార్యక్రమం చేపట్టదామని ఫిర్యాదులో పేర్కొనడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ జేఏసీ తాలూకు అధ్యక్షులు చెలిమప్ప మరియు నాయకులు నాగరాజు దుర్గేష్ నరసింహులు వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు

# కొత్తగూడెం కార్పోరేషన్‌పై ఎర్రజెండా ఎగరాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

### అభ్యర్థులకు బి ఫారం ల అందజేత



**కొత్తగూడెం, ఫిబ్రవరి 03(వార్త సంధ్య) :** కొత్తగూడెం కార్పోరేషన్‌పై ఎర్రజెండా ఎగరాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. రానున్న కార్పోరేషన్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం స్థానిక శేషగిరి భవన్‌లోని సిపిఐ కార్యాలయంలో పార్టీ తరపున బరిలో ఉన్న అభ్యర్థులకు ఆయన బిఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 11న జరగనున్న కొత్తగూడెం కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులు బరిలోకి దిగుతున్నారని తెలిపారు. టిడిపి, ప్రజా సంఘాల మద్దతుతో సిపిఐ ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ఎన్నికలను ఎదుర్కొంటోందన్నారు. పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. పూర్తిగా పార్టీ కార్యకర్తల ఆకాంక్షలకు అనుగుణంగానే కార్పోరేషన్ వ్యాప్తంగా పోటీ చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ నిర్ణయాన్ని ముఖ్యమంత్రి లేదా మంత్రులకు వ్యతిరేకంగా తీసుకున్నదిగా భావించాల్సిన అవసరం లేదని, స్థానిక రాజకీయ పరిస్థితులు, ప్రజా అవసరాల దృష్ట్యానే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గత రెండేళ్లలో కొత్తగూడెం నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరిగిందని, మారుమూల ప్రాంతాల్లో కూడా మౌలిక సదుపాయాల కల్పనకు శక్తివంచన లేకుండా కృషి చేశామని చెప్పారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా తమ పని కొనసాగుతోందన్నారు. కార్పోరేషన్ ఏర్పాటుతో పాల్వంచ ప్రాంతానికి 25 ఏళ్ల తర్వాత ఎన్నికలు జరుగుతున్నాయని, దీంతో ఆ ప్రాంత అభివృద్ధి మరింత వేగవంతం కానుందని పేర్కొన్నారు. కార్పోరేషన్ ఏర్పాటుకు వ్యతిరేకంగా కొన్ని శక్తులు కుట్రలు పన్నాయని, వాటిని పటాపంచలు చేస్తూ ప్రభుత్వం తాము ఇచ్చిన నివేదిక ఆధారంగా కార్పోరేషన్ ప్రకటించిందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధిని చూసి ఓటు వేయాలని, సిపిఐ అభ్యర్థులు గెలిస్తే కొత్తగూడెం కార్పోరేషన్ మరింత అభివృద్ధి బాటలో ముందుకు సాగుతుందని చెప్పారు. కార్పోరేషన్‌పై ఎర్రజెండా ఎగరేలా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## మేడ్చల్ మల్కాజ్గిరి. కలెక్టర్ గారిని కలిసిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..



**ఎల్బీనగర్ ప్రతినిధి, ఫిబ్రవరి 3(వార్త సంధ్య ) :** మంగళవారం నాడు. ఎల్.బి.నగర్ శాసనసభ్యులు సుధీర్ రెడ్డి గారు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మణుచౌదరి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి గారు మాట్లాడుతూ నాగోల్ డివిజన్ పరిధిలోని పత్తుల్లాగూడ నందు 58 జీ.ఓ.క్రింద కొందరికి పట్టాలు మంజూరు చేయడం జరిగిందని, ఇంకా కొంతమందికి పట్టాలు రాలేదని,రానివారికి పట్టాలు మంజూరు చేయాలని కోరారు.అక్కడ పేద ప్రజలు దాదాపు 70-80 గజాల ఇండ్లలో నివాసం ఉంటున్నారని తెలిపారు.అనంతరం కలెక్టర్ గారు మాట్లాడుతూ తమ యొక్క సిబ్బందిని పంపించి అక్కడ పట్టాలు రానివారికి పట్టాలు ఇప్పించడం జరుగుతుంది అని హామీ ఇచ్చారు.ఇట్టి కార్యక్రమంలో నాగోల్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి పాల్గొన్నారు.

## శంకర్‌పల్లిమున్సిపాలిటీలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఎన్నికల ప్రచారం

### కేసీఆర్‌నే తెలంగాణ జాతి పితామహుడు

### -కాంగ్రెస్ పాలనపై ఘాటు విమర్శలుకారు గుర్తుకు

### ఓటుతో కాంగ్రెస్‌కు గట్టి గుణపాఠం చెప్పాలి



**చేవెళ్ల , ఫిబ్రవరి 3 ( వార్త సంధ్య ) :** శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత సబితా ఇంద్రారెడ్డి పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమానికి నాయకత్వం వహించిన కేసీఆర్ ఖచ్చితంగా తెలంగాణ జాతి పితామహుడని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన నాయకుడిగా కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై తీవ్ర విమర్శలు గుప్పించిన సబితా ఇంద్రారెడ్డి, కేసీఆర్‌ను విమర్శించడమే ఆయన పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. పాలనపై దృష్టి సారించకుండా ప్రతిపక్షాలపై ఆరోపణలు చేయడం, డైవర్షన్ రాజకీయాలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానమని మండిపడ్డారు. స్కాంలను బయటపెడితే నోటీసులు జారీ చేస్తూ ప్రజలను భయపెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆమె విమర్శించారు. గత రెండేళ్లుగా పట్టణాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయని, కాంగ్రెస్ పాలనలో ప్రజలకు చెప్పుకోదగ్గ అభివృద్ధి ఏమీ కనిపించడం లేదని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మున్సిపాలిటీలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కోట్ల రూపాయలు ఖర్చు చేశారని గుర్తుచేశారు. మ్యానిఫెస్టోలో చెప్పిన పథకాలతో పాటు, చెప్పనివి కూడా అమలు చేసిన నాయకుడు కేసీఆర్ అని ఆమె స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీకి గట్టి గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నాలుగు వేల రూపాయల పెన్షన్ రావాలంటే, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటు వేయడమే మార్గమని స్పష్టం చేశారు. ప్రజల కష్టాలను అర్థం చేసుకునే పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని ఆమె పేర్కొన్నారు.

## దుబ్బాక బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడిగా ఎల్లెందుల శ్రీనివాస్ నియామకం



**దుబ్బాక ప్రతినిధి ఫిబ్రవరి 03(వార్త సంధ్య) :** దుబ్బాక బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడిగా దుబ్బాక తాజా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఎల్లెందుల శ్రీనివాస్ ని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, దుబ్బాక శాసనసభ్యులు గౌరవనీయులు కొత్త ప్రభాకర్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం కృషి చేసిన అనుభవం, ప్రజల్లో మంచి పేరు ఉన్న వ్యక్తిగా శ్రీనివాస్ మున్సిపల్ అధ్యక్ష బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. దుబ్బాక మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీని మరింత బలంగా నిలబెట్టడంలో ఆయన పాత్ర కీలకమని పేర్కొన్నారు నూతనంగా నియమితులైన మున్సిపల్ అధ్యక్షుడు ఎల్లెందుల శ్రీనివాస్ తనపై విశ్వా సం ఉంచిన పార్టీ అధిష్టానానికి, జిల్లా అధ్యక్షులు కొత్త ప్రభాకర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, పార్టీ సిద్ధాం తాలకు కట్టుబడి, కార్యకర్తలతో కలిసి దుబ్బాక మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా నని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## ములకలచెరువు మండలంలో గ్రామ కమిటీల నియామకాలు గ్రాండ్ సక్సెస్..

### - మళ్లీ వచ్చేది వైసీపీ ప్రభుత్వమే..

### - జగన్ మాట ఇచ్చాడంటే తప్పే మనస్తత్వం కాదు..



**అన్నమయ్య జిల్లా ప్రతినిధి - ఫిబ్రవరి 03 ( వార్త సంధ్య ) -** స్థానిక నియోజకవర్గ పరిధిలోని ములకలచెరువు మండల కేంద్రమైన అన్ని గ్రామాల్లోనూ తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన గ్రామ కమిటీల ఎంపికను విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా మంగళవారం ములకల చెరువు మండల వైసీపీ పార్టీ పరిశీలకులు పాగొండ ఖలీల్ అహ్మద్ ను ములకలచెరువు మండలాధ్యక్షుడు కోటిరెడ్డి మాధవరెడ్డి పలువురు వైసీపీ శ్రేణులు దుశ్శాలువ కప్పి పూల బొకే అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి, ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి పూర్తి నమ్మకంతో తనకు అందించిన భాద్యతను సక్రమంగా నిర్వహిస్తూ ఏ గ్రామంలోనూ గొడవలకు తావివ్వకుండా సామరస్యంగా అందరితో మమేకమై గ్రామ కమిటీల నియామకాన్ని విజయవంతంగా పూర్తికాబడ్డాయని మండల కేంద్రంలోని అన్ని గ్రామాల్లోనూ నియామకాలు పూర్తయ్యాయని నూతనంగా నియమితులైన గ్రామాధ్యక్షులు తమకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ అందరినీ కలుపుకొని గ్రౌండ్ లెవెల్ లో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తూ తమకు అందించిన పదవులను నిర్వీర్యం చేయకుండా పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తూ లోకల్ బాడీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని 2029 సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ మనమందరం వైయస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుందామని రాష్ట్ర ప్రజలంతా ముఖ్యమంత్రిగా జగనన్న ఉండుంటే బాగుండేదంటున్నారు. గడిచిన ఐదేళ్లలో ఆయన సుభిక్షంగా పాలన చేయబట్టి రాష్ట్ర ప్రజలంతా ఇప్పటికి ఆయనని కోరుకుంటున్నారు. మళ్లీ వచ్చేది వైసీపీ ప్రభుత్వమేనని కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్కరు ప్రశాంతంగా లేరని అన్ని వర్గాల ప్రజలు, పార్టీ శ్రేణులు ఇబ్బందులు పడుతున్నారని ఏ ఒక్కరికి లబ్ధి చెందలేదని వీటన్నింటిని జగన్ గమనిస్తున్నారని ఇవన్నీ గమనిస్తూ ఆయన ఒకటే మాట అంటున్నారని జగన్ 2 వర్షన్ లో కార్యకర్తలకే తొలి ప్రాధాన్యత అంటూ చెప్పుకొస్తున్నారని ఆయన మాటిచ్చాడంటే మాట తప్పే మనస్తత్వం కాదని తూచా పాటిస్తారని కాబట్టి కార్యకర్తలు కష్టపడితే జగన్ మదిలో శాశ్వతంగా నిలిచిపోతారని తొలి ప్రాధాన్యత మీకే ఉంటుందంటూ మాధవ రెడ్డి, ఖలీల్ అహ్మద్ అన్నారు. ఈ కార్యక్రమంలో బి. కొత్తకోట టౌన్ అధ్యక్షుడు చిన్ని కృష్ణ, ప్రత్యేక ఆహ్వానితుడు సిద్ధారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎర్రం రెడ్డి రెడ్డప్ప రెడ్డి, సర్పంచ్ మంజుల రామనాథం, ఎంపీటీసీ రేష్మ రఫీ, బూత్ కమిటీ అధ్యక్షుడు బోనాల చాంద్ భాషా, వైసీపీ శ్రేణులు ఉమా మహేష్, స్టోర్ విశ్వనాథ్ రెడ్డి, సుందరరాజ్, రామిరెడ్డి, మనోహర్ రెడ్డి, ఉత్తన్న, తోపు రమణ, మల్లప్ప, పార్టీ యువ నాయకుడు మహేశ్వర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, సోషల్ మీడియా యాక్టివేషన్ చింతకుంట్ల నాగేంద్ర పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు..

## అభివృద్ధి పనులను ప్రజలు పర్యవేక్షించాలి:ఎమ్మెల్యే బొలిశెట్టి.



**తాడేపల్లిగూడెం, ఫిబ్రవరి 3 (వార్త సంధ్య) :** రోడ్లు,డ్రైన్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులను ఆయా గ్రామాల ప్రజలు పర్యవేక్షించాలని,నాణ్యమైన అభివృద్ధి పనులు జరిగేందుకు సహకరించాలని తాడేపల్లిగూడెం శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు.గ్రామీణ మండలం పెద తాడేపల్లి గ్రామం నుంచి రామన్నగూడెం,జగ్గనపేట, వెంకట రామన్న గూడెం వరకు అదనపు ప్రణాళిక నిధులు మూడు కోట్ల 50 లక్షలతో చేపట్టిన ఈ సిమెంటు రోడ్డు, తారు రోడ్డు నిర్మాణం పనులను మంగళవారం ఎమ్మెల్యే పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాలను పట్టణానికి అనుసంధానిస్తూ నిర్మించే ఈ రోడ్లు అభివృద్ధికి బాటలు పరుస్తాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రజలు అనేక అవస్థలు పడ్డారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రోడ్లు, డ్రైన్లు నిర్మించి పూర్తిస్థాయిలో అన్ని గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తుందని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం అభివృద్ధి కోసం పనిచేస్తున్న ప్రభుత్వానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు అడపా ప్రసాదు, పెంటపాడు మండల జనసేన అధ్యక్షులు పుల్లా బాబీ, పరిమి సురేష్, ఎంపీటీసీ గోవిందు, బండి బుజ్జిబాబు, పరిమి సూర్యనారాయణ,పాలూరి వెంకటేశ్వరరావు, రామ లక్ష్మణ్, మద్దిపాటి ధర్మేంద్ర, మద్దిపర్తి రవితేజ, ఉడతా బాలాజీ, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న...

### టిపిసిసి ఉపాధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డా చిక్కుడు వంశీకృష్ణ ...



**అచ్చంపేట ప్రతినిధి, ఫిబ్రవరి 3 (వార్త సంధ్య):** మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఐదో వార్డు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కేతావత్ జయమ్మ గారికి మద్దతుగా ఈరోజు మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం స్థానిక ఎమ్మెల్సీ శంకర్ నాయక్ గారితో కలిసి ప్రచారంనిర్వహించిన టిపిసిసి ఉపాధ్యక్షులు అచ్చంపేట ఎమ్మెల్యే మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జ్ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ... ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడుతూ... మిర్యాల గూడ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి మున్సి పాలిటీ అభివృద్ధికి పాటుపడాలని ఈ సందర్భంగా స్థానిక ఓటర్లకు విజ్ఞప్తి చేశారు...అధికార పార్టీకి అభ్యర్థికి ఓటేద్దాం అభివృద్ధిని మరింతగా చేసుకుందాం అని స్థానిక ఓటర్లను విజ్ఞప్తి చేశారు... ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు నర్సిరెడ్డి సందీప్ జైపాల్ ,రవీందర్, స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించిన హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**ఎల్బీనగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 03:** హయత్ నగర్ డివిజన్లోని బ్లడ్ బ్యాంక్ కాలనీలో గత కొంతకాలంగా లో వోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉండటంతో గృహాలలోని ఎలక్ట్రానిక్ పరికరాలు దెబ్బతినడం, ఫ్యాన్లు, మోటార్లు సరిగా పనిచేయక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను స్థానికులు కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించారు. విద్యుత్ శాఖ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి పరిస్థితిని పరిశీలించిన కార్పొరేటర్ శాశ్వత పరిష్కారంగా నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించారు. దీంతో కాలనీలో విద్యుత్ సరఫరా మెరుగుపడి వోల్టేజ్ సమస్య పూర్తిగా తగ్గింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారం తమ బాధ్యత అని, ప్రతి కాలనీలో మెరుగైన మౌలిక సదుపాయాలు అందించే దిశగా కృషి కొనసాగుతుందని తెలిపారు. కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎ.ఈ ఖాదర్ అలీ, లైన్ మ్యాన్ అశోక్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, బీజేవైఎం అధ్యక్షులు అఖిలేష్ మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించాలి: మైక్రో అబ్జర్వర్లకు అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సూచన



రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 3 ( వార్త సంధ్య ) : ఎన్నికలలో అత్యంత కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్ మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలు తు.చ తప్పకుండా అమలయ్యేలా, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆయన తెలిపారు.జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలలో పోలింగ్ సరళిని సూక్ష్మ స్థాయిలో పరిశీలించేందుకు నియమించబడిన మైక్రో అబ్జర్వర్లకు మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియను అనుసరిస్తూ ఆయా ప్రాంతాల పోలింగ్ కేంద్రాల్లో మైక్రో



అబ్జర్వర్లకు పరిశీలన బాధ్యతలు కేటాయిస్తామని తెలిపారు. పోలింగ్‌కు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన ఉంటేనే పోలింగ్ తీరుతెన్నులను సమర్థవంతంగా పరిశీలించగలుగుతారని అన్నారు. పోలింగ్‌కు ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకొని, పోలింగ్ సిబ్బందికి అందించాల్సిన సామాగ్రి సక్రమంగా అందిందా లేదా అన్నది పరిశీలించాలని, అనంతరం పోలింగ్ సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా మాక్ పోలింగ్ నిర్వహించారా లేదా, మాక్ పోలింగ్ అనంతరం చేపట్టే అసలు పోలింగ్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతోందా లేదా అన్నది నిశితంగా గమనించాలని తెలిపారు.పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, సీక్రెట్ పోలింగ్ కంపార్ట్మెంట్ సక్రమంగా ఏర్పాటు చేశారా లేదా అన్నది పరిశీలించాలని, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారా అన్నది గమనించాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్ల బాధ్యత పరిశీలన వరకే పరిమితమని, ఎక్కడా పోలింగ్ ప్రక్రియలో జోక్యం చేసుకోరాదని స్పష్టం చేశారు. పోలింగ్ ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు అన్ని అంశాలను గమనిస్తూ, తక్షణమే జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని, ఓటింగ్ గోప్యతను కాపాడే విధంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని, పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జరిగే పరిణా మాలను కూడా గమనిస్తూ జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి సుసిందర్ రావు, మాస్టర్ ట్రైనర్లు, మైక్రో అబ్జర్వర్లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చలో పోతిరెడ్డిపాడు కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ ను ఘనంగా ఆవిష్కరించిన వైసీపీ నేతలు..

**- ఏపీలో వరుసగా జరుగుతున్న పరిణామాలపై ఆగ్రహం..**

**- సొంత జిల్లా వాసి అయ్యుండి ఆయనకంటే పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డికే హెచ్చు ప్రజాదరణ..**



**అన్నమయ్య జిల్లా ప్రతినిధి – ఫిబ్రవరి 03 ( వార్త సంధ్య ) –** స్థానిక నియోజకవర్గ పరిధిలోని సదుం మండల కేంద్రమైన ఎర్రాతివారిపల్లి గ్రామంలో గల పిఎల్ ఆర్ కమిటీ హాల్ ప్రాంగణంలో మంగళవారం రీజనల్ కో ఆర్డినేటర్, రాష్ట్ర మాజీ మంత్రి, పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యవేక్షణలో మంగళవారం పుంగనూరు నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ టాస్క్ ఫోర్స్ సమన్వయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, తిరుపతి మాజీ శాసనసభ్యులు, వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి, అన్నమయ్య జిల్లా పార్టీ అధ్యక్షులు ఆకేపాటి అమరనాథ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పుత్తా శివశంకర రెడ్డి, నెల్లూరు జిల్లా ఎమ్మెల్సీ పర్వత చంద్రశేఖర్ రెడ్డి, ఆర్గనైజేషన్ సెక్రటరీ వజ్ర భాస్కర రెడ్డి, పార్టీ అబ్జర్వర్ & పరిశీలకులు నూతన కాల్వ అనిషారెడ్డి తదితరులు హాజరయ్యారు. కార్యక్రమ నిర్వహణకు ముందు దివంగత నేత స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ నెల 5న జరగనున్న చలో పోతిరెడ్డిపాడు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని దుష్ప్రచారం చేసి ప్రజల మనోభావాలను దెబ్బతీసిన కూటమి నేతలు క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేస్తూ పోస్టర్లను కార్యక్రమానికి విచ్చేసిన నేతల చేతుల మీదుగా విడుదల చేశారు. అనంతరం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఏపీలో వరుసగా జరుగుతున్న పరిణామాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి నేతల అదికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. అసలు ఈ ప్రభుత్వం ప్రజల ఓట్లతో గెలిచిందా లేక ఈవీఎంల ద్వారా మీరే గెలిపించుకున్నారా అని పెద్దిరెడ్డి నిలదీశారు. ఏపీలో మూడు రోజులుగా జరుగుతున్న పరిణామాలు అత్యంత జుగుప్సాకరంగా ఉన్నాయన్నారు.' రాష్ట్రంలో మూడు రోజులుగా జరుగుతున్న పరిమాణాలు మీరంతా చూస్తూనే ఉన్నారని ఈ ప్రభుత్వాన్ని ప్రజలు ఓట్లతో గెలిపించారా.ఈవీఎంలు ద్వారా గెలిపించుకున్నారా. కూటమి నేతలు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. మాజీ మంత్రుల ఇళ్లపై దాడులు చేస్తున్నారు. గత ఐదేళ్లలో వైఎస్ జగన్ పాలనలో ఇలాంటి దాడులు ఎన్నడూ జరగలేదు. దీన్ని ప్రజలు గమనించాలని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెల్లాలని పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి సూచించారు. చంద్రబాబు నాయుడుకు భక్తి కన్నా రాజకీయాలే ఎక్కువైపోయాయని ప్రభుత్వ వైఫల్యాలను కప్పి పుచ్చేందుకు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. వేల కోట్ల రూపాయల విలువైన ప్రజా ఆస్తులను తన కుటుంబ సభ్యులకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వైఎస్ఆర్ సీపీ సీనియర్ నేతలు అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై దాడులు కూడా ఇదే కుట్రలో భాగమన్నారు. ఈ ప్రాంతంలో మూడు రిజర్వాయర్ల నిర్మాణాలను నిలిపివేశారన్నారు. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు పనులు కూడా నిలిపివేశారన్నారు. చంద్రబాబుతో ఉన్న అనుబంధంతోనే ఆ పనులను నిలిపివేశానని తెలంగాణ అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి వైఎస్ఆర్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ కమిటీల ప్రాధాన్యతను వివరించారు. ప్రజల కష్ట నష్టాల్లో పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి ఎప్పుడూ ముందుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. చంద్రబాబు నాయుడుకు 18 ఏళ్ల ముఖ్యమంత్రి అనుభవం ఉన్నప్పటికీ, ఆయన సొంత జిల్లాలో కూడా పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డికే హెచ్చు ప్రజాదరణ ఉందన్నారు. రాష్ట్రంలో రాక్షస, కుట్రల పాలన కొనసాగుతోందని, దానిపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తోందని స్పష్టం చేశారు. తిరుమల లడ్డూకు సంబంధించి దుష్ప్రచారం చేసిన కూటమి నేతలపై విమర్శలు గుప్పించారు. వైఎస్ఆర్ సీపీ సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో అత్యున్నత ల్యాబ్‌లలో పరీక్షలు జరిపి లడ్డూలో ఎటువంటి జంతు కొవ్వు కలవలేదని నిర్ధారణ అయ్యిందన్నారు..

## నగరాల్లో వ్యాధులపై నిఘా మరింత బలోపేతం

**ఎంఎస్‌యూ సిబ్బందికి మూడు రోజుల సంయుక్త శిక్షణ ప్రారంభం**

**జీహెచ్‌ఎంసీ ప్రతినిధి, ఫిబ్రవరి03 ( వార్త సంధ్య ) :** నగర ప్రాంతాల్లో ప్రజారోగ్య భద్రతను మరింత పటిష్టం చేయడానికి జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ (ఎంఎస్‌యూ) సిబ్బందికి మూడు రోజుల సంయుక్త ఇండక్షన్ శిక్షణ కార్యక్రమం మంగళవారం జూబ్లీహిల్స్‌లోని డా. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రారంభమైంది. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, థానే నగరాలకు చెందిన ఎంఎస్‌యూ సిబ్బంది ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 5వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ కార్యక్రమానికి హాజరైన జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ నగరాల్లో వ్యాధుల నివారణ, నియంత్రణలో ఎంఎస్‌యూ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వ్యాధుల వ్యాప్తిపై సత్వర సమాచారం సేకరణ, ధృవీకరణతో పాటు తక్షణ చర్యలు చేపట్టడం వారి ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. నీటి ద్వారా వ్యాపించే అక్యుట్ డయేరియా, కలరా, వైరల్ హెపటైటిస్ వంటి వ్యాధులు, దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా వంటి వ్యాధుల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు. ఫుడ్ పాయిజనింగ్, జూనోటిక్ వ్యాధుల నియంత్రణలో 'వన్ హెల్త్' విధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. మురికివాడలు, అధిక జనసాంద్రత ప్రాంతాలు, వలస కార్మికులు నివసించే ప్రాంతాల్లో వ్యాధుల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని, అక్కడ ప్రత్యేక చర్యలు చేపట్టాలని కమిషనర్ సిబ్బందికి సూచించారు. ప్రధాన




మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పీఎం-ఏబీహెచ్‌ఐఎం) కింద ఏర్పాటు చేసిన ఎంఎస్‌యూ హైదరాబాద్ నగర వ్యాధుల పర్యవేక్షణకు కేంద్రంగా పనిచేస్తోందని తెలిపారు. 17 పోస్టులకు గాను ఇప్పటికే 14 మందిని నియమించగా, మిగిలిన ఖాళీలను త్వరలో భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. కొత్తగా నియమితులైన సిబ్బందికి శాఖాపరమైన శిక్షణ కొనసాగుతోందన్నారు. నారాయణగూడలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం)లో ప్రయోగశాల సేవలు అందుబాటులో ఉన్నాయని, బయోసేఫ్టీ లెవల్-2 పరికరాల కొనుగోలు ద్వారా మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. హరిహర కళాభవన్‌లో ఏర్పాటు చేస్తున్న కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా వ్యాధుల పర్యవేక్షణ, స్పందన చర్యలు వేగవంతం అవుతాయని వివరించారు. హైదరాబాద్‌లో డెంగ్యూ కేసుల పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించిన వెక్టర్ బోర్న్ డిసీజ్ యాప్ ద్వారా రియల్‌టైమ్‌లో కేసుల గుర్తింపు, జీఐఎస్ మ్యాపింగ్, ఫీల్డ్ స్థాయిలో చర్యలు సమర్థంగా అమలవుతున్నాయని తెలిపారు. మూడు రోజుల శిక్షణలో భాగంగా ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫామ్ (ఐహెచ్‌ఐపీ)పై ప్రత్యక్ష శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఎపిడెమియాలజీ పరిశోధనలు, వ్యాధి ప్రబలత కేస్ స్టడీస్, డేటా భద్రత, రిస్క్ కమ్యూనికేషన్, కమ్యూనిటీ అవగాహన, ప్రజారోగ్య చట్టపరమైన అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ ఒకే శాఖ బాధ్యత కాకుండా ఆరోగ్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, పశుసంవర్ధక, పర్యావరణ శాఖల సమిష్టి కృషితో సాధ్యమవుతుందని కమిషనర్ తెలిపారు. ఈ శిక్షణ ద్వారా పరస్పర సమన్వయం పెంపొందించుకోవాలని సూచించారు. తెలంగాణా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు , ప్రధాన శాఖల ఉన్నత అధికారులు, సీనియర్ అధికారులు పాల్గొని, పట్టణ ప్రజల ఆరోగ్య రక్షణలో బలమైన పర్యవేక్షణ , తక్షణ వైద్య సేవలు అందించుటలో నిర్వహించవలసిన వ్యవస్థల ప్రాముఖ్యత గురించి తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్‌లు హేమంత కేశవ్ పాటిల్, రఘు ప్రసాద్, జోనల్‌కమిషనర్ ప్రియాంక అల,జాయింట్ డైరెక్టర్ డా. శుభాంగి కుల్సంగే, డా. ప్రదీప్ అవాటే (ఎంఎస్‌యూ), రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ, చీఫ్ మెడికల్ ఆఫీసర్ (హెల్త్) డా. పద్మజ,చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ వకీల్ , ఆమోహ్ లు పాల్గొన్నారు.


## సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయాన్ని దర్శించుకున్న కర్మన్ ఘాట్ ధ్యానాంజనేయ ఆలయ డైరెక్టర్ పూల నాగరాజు

**సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయం రానున్న రోజుల్లో మంచి పుణ్యక్షేత్రంగా పేరుగాంచుతుంది : నాగరాజు**











**రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి03 ( వార్త సంధ్య ):** రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం నియోజకవర్గం, రావిరాల గ్రామంలో ఉన్న సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయాన్ని మంగళవారం రోజు కర్మన్ఘాట్ ధ్యానాంజనేయ ఆలయ డైరెక్టర్ పూల నాగరాజు, వార్త సంధ్య సంపాదకులు కిరణ్ కుమార్,ఓపెన్ ఫ్రేమ్ ఇంగ్లీష్ పత్రిక సంపాదకులు కట్ట సత్యనారాయణ, జర్నలిస్ట్ ఎస్బిఎన్ చారి తో కలిసి సూర్యగిరి ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ధ్యానాంజనేయ ఆలయ డైరెక్టర్ నాగరాజు మాట్లాడుతూ... సూర్యగిరి ఎల్లమ్మ అమ్మవారు చాలా మహిమగల దేవత అని అన్నారు. రోజురోజుకు అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి భారీగా పెరుగుతుందన్నారు. సూర్యగిరి ఎల్లమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వంతోపాటు, దాతలు మరికొంతమంది కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. అమ్మవారికి ఇష్టమైన రోజున మంగళవారం రోజు భక్తులు భారీ సంఖ్యలో విచ్చేస్తున్నారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయ నిర్వాహకులు ప్రత్యేక చర్యలు తీసుకుం టున్నారని, వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ ఈవో, ఆలయ సిబ్బంది ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవడం హర్షణీయమని అన్నారు. రంగారెడ్డి జిల్లా పరిధిలో మంచి పుణ్యక్షేత్రంగా రానున్న రోజుల్లో పేరు గాంచనున్నదని ఆయన అన్నారు. భక్తులు కోరిన కోరికలు తీర్చే అమ్మవారిగా ప్రసిద్ధిగాంచిందని, భక్తులు సైతం తమ కోరికలు తీరుతుండడంతో భారీ సంఖ్యలో అమ్మవారి దేవాలయానికి విచ్చేస్తున్నారని నాగరాజు పేర్కొన్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించడానికి ఆలయ నిర్వాహకులు కృషి చేయాల్సిన అవసరం ఉందని సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ నిర్వాహకులకు సూచించారు. తనకు మీడియా మిత్రులకు ప్రత్యేక దర్శనం కల్పించిన సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయ ఈవో ఆలయ నిర్వాహకులకు ఆలయ అర్చకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ ఆర్ రత్నం, ఆలయ ఈవో వి మోహన్ రావు, జూనియర్ అసిస్టెంట్ ఎం కాశీనాథ్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు జి బాల్ రాజ్, టీ గోవర్ధన్ రెడ్డి, ఎం చంద్రశేఖర్ రెడ్డి,పి అర్జున్, ఏ శ్రీలత, కే పల్లవి గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళా, ఇద్దరు పిల్లలు అదృశ్యం








ఎల్బీనగర్ ప్రతినిధి,వార్త సంధ్య, ఫిబ్రవరి 03: ఆకాష్ నగర్ కాలనీ, హయత్ నగర్ నందు నివాసం ఉంటున్న అస్మా బేగం కి సయ్యద్ హమీద్ తో 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది, వారికి నలుగురు సంతానం కలరు, ఒక పాప మదీనా బేగం, వయసు 11 సంవత్సరాలు తను హాస్టల్ నందు ఉంటూ చదువుకుంటున్నది. మిగతా ముగ్గురు కుమారులు సయ్యద్ ఇబ్రాహీం, సయ్యద్ ఫయాజ్, సయ్యద్ అద్నాన్ వారితోపాటే ఉంటున్నారు. తేదీ 30.01.2026 రోజున ఉదయం 08:00 గంటల సమ యంలో సయ్యద్ హమీద్ కుంట్లూర్ దగ్గర తను పనిచేసే వెల్డింగ్ షాప్ కు వెళ్ళగా ఆత ర్వాత ఉద యం 10:20 గంటలకు అస్మాబేగం తన తమ్ముడు సల్మాన్ కి ఫోన్ చేసి తను పేరెంట్స్ టీచర్ మీటింగ్ కి వెళుతున్నాను తన కొడుకు ఇబ్రహీం ను చూసుకో అని చెప్పి సయ్యద్ ఫయాజ్, వయసు 7 సంవత్సరాలు మరియు సయ్యద్ అద్నాన్ ను తీసుకొని వెళుతున్నాను చెప్పి ఇంట్లో నుండి వెళ్ళ టం జరిగినది. సయ్యద్ హమీద్ తన పని ముగించుకొని ఇంటికి వచ్చేసరికి అస్మాబేగం. తన ఇద్దరు పిల్లలు సయ్యద్ ఫయాజ్, సయ్యద్ అద్నాన్ ఇంట్లో లేరు అని తన మరొక కొడుకు ఇబ్రహీంను అడుగగా అమ్మ ఆటోలో వెళ్ళింది అని చెప్పగా వాళ్ళ గురించి చుట్టుపక్కల ప్రాంతాలలో వెతికిన ఎటువంటి ఆచూకీ లభించలేదు అని వారిని వెతకడంలో సహాయం చేయగలరు సయ్యద్ హమీద్ ఫిర్యాదు చేయడమైనది.

## ఇద్దరు విద్యార్థుల కిడ్నాప్ కలకలం..

**సినీ నటుడు మోహన్ బాబు ఆయన కుమారుడు మంచి విష్ణు లపై కేసు నమోదు..**




**అన్నమయ్య జిల్లా ప్రతినిధి – ఫిబ్రవరి 03 ( వార్త సంధ్య ) –** ప్రముఖ నటుడు మంచు మోహన్ బాబు విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారంటూ కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించేందుకు బయల్దేరిన విద్యార్థి సంఘం నాయకులు కిడ్నాప్‌కు గురయ్యారు. దీంతో సహచర విద్యార్థి సంఘం నాయకులు వెంటనే తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు దృష్టికి వెళ్లడంతో ఏఎస్పీ రవి మనోహరాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక బృందాలు వెంటనే రంగంలోకి దిగి నారావారిపల్లి సమీపంలోని భీమవరం వద్ద కిడ్నాపర్ల వాహనాన్ని అడ్డుకున్నాయి. కిడ్నాప్‌నకు గురైన విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు విడిపించి తిరుచానూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అలాగే తిరుచానూరు పోలీసులు కిడ్నాపర్లను అరెస్ట్ చేశారు. వారి వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కిడ్నాప్‌నకు పాల్పడిన వారంతా మోహన్ బాబు కాలేజీ బౌన్సర్లుగా పోలీసులు గుర్తించారు. కిడ్నాప్ చేసిన వారితో పాటు చేయించిన వారిపైనా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ప్రవర్తిస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా హెచ్చరించారు. కిడ్నాప్‌నకు గురైన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్‌తో పాటు నవీన్ ఉన్నారు.

**మోహన్ బాబు యూనివర్సిటీని బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్..**




అయితే విద్యార్థులను కిడ్నాప్ చేసిన మోహన్ బాబు యూనివర్సిటీని బ్లాక్ లిస్టులో పెట్టాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అంతేకాదు నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు యూనివర్సిటీ చెల్లించాల్సిన కోట్లాది రూపాయాలను వెంటనే చెల్లించాలని, గతంలో హయ్యర్ ఎడ్యుకేషన్ శాఖ నోటీసులు ఇచ్చి జరిమానా విధించినప్పటికీ మోహన్ బాబులో ఎలాంటి మార్పు రాలేదని విద్యార్థి సంఘాలు మండిపడ్డాయి..

## రంగారెడ్డి జిల్లాలో పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ పూర్తి



**రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 03 (వార్త సంధ్య):** ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ మయంక మిట్టల్ మరియు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సమక్షంలో పూర్తి చేశారు.జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ఈ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా చేపట్టారు. జిల్లాలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది, కౌంటింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. పోలింగ్ సిబ్బందికి ఇప్పటికే మొదటి విడత శిక్షణను వివిధ కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్ల ద్వారా నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. రెండవ విడత శిక్షణ తరగతులను ఫిబ్రవరి 06, 2026న వారికి కేటాయించిన కేంద్రాలలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల విధులకు గైర్హాజరైనట్లయితే ఎన్నికల నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీపీఓ సురేష్ మోహన్, జీఎం ఇండస్ట్రీస్ శ్రీలక్ష్మి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యూపీ అసెంబ్లీలో 'కర్ణాటక స్పీకర్ సింహాసనం'



కర్ణాటక అసెంబ్లీలో స్పీకర్ కుర్చీని చూసి మనసుపడ్డ ఉత్తరప్రదేశ్ స్పీకర్ సతీశ్ మహానా దాదాపు రూ.30 లక్షలు ఖర్చు చేసి అలాంటి కుర్చీనే తయారుచేయించుకున్నారు. సతీశ్ మహానా కోరిక మేరకు కర్ణాటక స్పీకర్ ఖాదర్.. తన కుర్చీని పోలిన కుర్చీ తయారీకి కళాకారులను పురమాయించారు. పదిమంది కళాకారులు దాదాపు 2 నెలల పాటు శ్రమించి ఈ కుర్చీని తయారు చేశారు. ఇప్పటికే ఈ కుర్చీని ఉత్తర్‌ప్రదేశ్ కు పంపించినట్లు.. ఆ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు ముందు ఫిబ్రవరి 5 నాటికి అక్కడికి చేరుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో ప్రస్తుతం ఇటు కర్ణాటకలో, అటు ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలలో ఒకే తరహా కుర్చీలు ఉండనున్నాయి. వివరాల్లోకి వెళితే..గతేడాది కర్ణాటకలో జరిగిన కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సదస్సు కోసం ఉత్తరప్రదేశ్ స్పీకర్ సతీశ్ మహానా బెంగళూరుకు వచ్చారు. ఆ సమయంలో సభలో స్పీకర్ కుర్చీ ఆయనను బాగా ఆకట్టుకుంది. ఆ కుర్చీని తయారుచేసిన కళాకారుడి గురించి ఖాదర్ ను ఆరా తీశారు. యూపీ సభలోనూ ఇలాంటి కుర్చీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. దీంతో మైసూరుకు చెందిన కళాకారులను ఖాదర్ ఆయనకు పరిచయం చేశారు. ఆ తర్వాత చిన్న డిజైన్ మార్పులతో కర్ణాటక కుర్చీ నమూనా ఆధారంగానే కొత్త కుర్చీ తయారీకి ఏర్పాట్లు జరిగాయి.

**కుర్చీ ప్రత్యేకతలు ఇవే..**

రోజ్‌వుడ్‌తో తయారు చేసిన ఈ కుర్చీ.. 7.5 అడుగుల ఎత్తు, 4 అడుగుల వెడల్పు ఉంటుంది. కుర్చీపైన గొడుగు లాంటి ఆకారం ఉంది. ఆర్మ్‌రెస్ట్ భాగంలో సింహం, ఏనుగు బొమ్మలు కళాత్మకంగా చెక్కారు. దానిపైన ఉత్తరప్రదేశ్ రాజముద్ర ఏర్పాటు చేశారు. సీటు భాగాన్ని లెదర్తో చేసినట్లు కళాకారుడు కైజర్ అలీ ఖాన్ తెలిపారు.

### రాత్రి పూట డిన్నర్ చేశాక వాకింగ్

## చేస్తే ఎన్నో అద్భుతమైన ఫలితాలు



మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వ్యాయామం చేయాలన్న సంగతి తెలిసిందే. అయితే వ్యాయామం అంటే మరీ కష్టపడి జిమ్‌లో కసరత్తులు చేయాల్సిన పనిలేదు. రోజూ కనీసం 30 నిమిషాల పాటు సాధారణ వాకింగ్ చేసినా చాలు. ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఉదయం వాకింగ్ చేయడం వల్ల రోజంతా మెటబాలిజం ఎక్కువగా ఉంటుంది. ఇది క్యాలరీలను కరిగిస్తూనే ఉంటుంది. కనుకనే ఉదయం వ్యాయామం చేయాలని వైద్యులు చెబుతుంటారు. అయితే కేవలం ఉదయం మాత్రమే కాదు.. రాత్రి పూట భోజనం అనంతరం కూడా వాకింగ్ చేయాలి. దీంతో మరింత ఎక్కువ ప్రయోజనం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. రాత్రి పూట డిన్నర్ చేసిన అనంతరం వాకింగ్ చేయడం ఎన్నో మంచి ఫలితాలను ఇస్తుందని వారు అంటున్నారు.

**అధిక బరువు, షుగర్ లెవల్స్..**

రాత్రి పూట భోజనం చేసిన అనంతరం కనీసం 10 నిమిషాల పాటు తేలికపాటి నడక కొనసాగించాలి. రాత్రి పూట మన మెటబాలిజం తగ్గుతుంది. కానీ వాకింగ్ చేస్తే మెటబాలిజంను పెంచుకోవచ్చు. దీంతో రాత్రి మనం నిద్రించిన కూడా మన శరీరం క్యాలరీలను ఖర్చు చేస్తూనే ఉంటుంది. ఫలితంగా మనం నిద్రలో ఉన్నా కూడా మన శరీరంలోని కొవ్వు కరుగుతుంది. దీంతో అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలనుకునే వారు కచ్చితంగా రాత్రి పూట డిన్నర్ తరువాత వాకింగ్ చేస్తే ఎన్నో మంచి ఫలితాలను పొందవచ్చు. ఇక రాత్రి పూట భోజనం అనంతరం వాకింగ్ చేయడం వల్ల షుగర్ లెవల్స్ అదుపులో ఉంచుకోవచ్చు. ఒక అధ్యయనం ప్రకారం రాత్రి డిన్నర్ తరువాత వాకింగ్ చేసేవారి ఫాస్టింగ్ షుగర్ లెవల్స్ చాలా వరకు తగ్గాయని తేల్చారు. కనుక డయాబెటిస్ ఉన్నవారు ఫాస్టింగ్ షుగర్ లెవల్స్‌ను తగ్గించుకునేందుకు గాను రాత్రి పూట డిన్నర్ చేసిన అనంతరం వాకింగ్ చేయాలి. డయాబెటిస్ ఉన్నవారికి ఇది ఎంతగానో మేలు చేసే విషయం.


**కొలెస్ట్రాల్ లెవల్స్..**

కొలెస్ట్రాల్ లెవల్స్ అధికంగా ఉన్నవారు రోజూ కచ్చితమైన డైట్‌ను పాటిస్తూ వ్యాయామం చేయాల్సి ఉంటుంది. అప్పుడే కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. అయితే రాత్రి పూట భోజనం చేసిన అనంతరం కాసేపు వాకింగ్ చేయడం వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్ గణనీయంగా తగ్గుతాయని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు రోజూ రాత్రి వాకింగ్ చేస్తే ఎంతగానో ఫలితం ఉంటుంది. అలాగే రోజూ రాత్రి వాకింగ్ చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. అజీర్తి ఉండదు. భోజనం చేసిన వెంటనే గ్యాస్ వస్తుందని, కడుపు ఉబ్బరంగా ఉంటుందని భావించే వారు రాత్రి పూట భోజనం చేసిన అనంతరం కాసేపు వాకింగ్ చేస్తే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. రాత్రి పూట డిన్నర్ అనంతరం వాకింగ్ చేయడం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది.

**గుండె ఆరోగ్యానికి..**

సాధారణంగా భోజనం చేసిన వెంటనే శరీరంలో రక్త సరఫరా మొత్తం జీర్ణాశయం వైపు చేరుతుంది. కానీ రాత్రి తిన్న అనంతరం వాకింగ్ చేస్తే రక్త సరఫరా మెరుగు పడుతుంది. హైబీపీ ఉన్నవారికి ఇది ఎంతగానో మేలు చేస్తుంది. బీపీ ఉన్నవారు రాత్రి తిన్న అనంతరం వాకింగ్ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి. రాత్రి డిన్నర్ అనంతరం వాకింగ్ చేయడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పనితీరు మెరుగు పడుతుంది. రాత్రి వాకింగ్ చేయడం వల్ల మనస్సు ప్రశాంతంగా మారుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. దీంతో నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. ఇలా రాత్రి పూట డిన్నర్ అనంతరం వాకింగ్ చేయడం వల్ల అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

## మీరు యజమానా? వాచ్ మ్యానా?




దైనందిన జీవితంలో సత్యం అనిపించిన ఎన్నో విషయాలు ఆర్థిక సూత్రాల్లో అంతగా ఇమడవు! ఓ మధ్యతరగతి మనిషికి పొదుపు అంటే%ా% ఖర్చులు తగ్గించుకోవడం వరకే ఆలోచిస్తాడు. మదుపు అంటే ప్రైవేటుగా చిట్స్ వేసి.. ధర్మవడ్డీకి తిప్పడమనే తెలుసు!! ముచ్చటపడి కట్టుకున్న ఇంట్లో మురిపెంగా ఉండాలని ఉన్నా.. ఇంకేదో ఆశిస్తాడు. రూపాయి, రూపాయి కూడబెట్టి ఇల్లు మీద ఇల్లు కట్టి.. యజమానిగా చెలామణీ కావాలని ఆశిస్తాడు. ఈ రకంగా ఆలోచించిన ఎందరో.. యజమానులుగా కన్నా, జీతం భత్యం లేని వాచ్‌మెన్లుగా మిగిలిపోతున్నారు. ఏ పెట్టుబడి అయినా మనల్ని ఉన్నస్థితి నుంచి ఉన్నత స్థాయికి తీసుకెళ్లేదై ఉండాలి. కానీ, ఆ పెట్టుబడే గుదిబండగా మారితే.. ఆశించిన లాభాలు రావు సరికదా, తలకు మించిన భారంగా పరిణమిస్తుంది. నడివయసులోనే సొంతింటి కలను నిజం చేసుకున్న వారు నిజంగా అదృష్టవంతులే! దానికి తృప్తిచెంది.. ఇతర పెట్టుబడుల గురించి ఆలోచిస్తే మేలైన జీవితాన్ని సొంతం చేసుకోవచ్చు. కానీ, చాలామంది మూసపద్ధతికి అలవాటుపడినవాళ్లే ఉంటారు. వాళ్లు చేసే తప్పులు ఎలా ఉంటాయో పరశురామ్ కథ చదివితే అర్థమవుతుంది. పరశురామ్ ప్రైవేట్ ఉద్యోగి. మంచి జీతం వస్తుంది. ఊళ్లో కొద్దోగొప్పో ఆస్తి ఉంది. భార్య, ఇద్దరు పిల్లలు. జీవితం ఉన్నంతలో రిచ్‌గానే సాగిపోతుంది. పిల్లలు బడి వయసు దాటి కాలేజీలోకి ప్రవేశించారు. ఒకరోజు పరశురామ్ అత్తామామ ఊడిపడ్డారు. అత్తగారేమో తన కూతురుతో వంటింట్లో సొంతిళ్లు సొద మొదలుపెట్టింది. మామగారేమో అల్లుడితో అదే విషయాన్ని తన అనుభవాన్నంతా రంగరించి చెప్పనారంభించాడు. 'అల్లుడుగారూ! కూడబెట్టిన సొమ్ముతో మంచి స్థలం తీసుకోండి. మంచి బిల్డర్‌కు ఇచ్చి లోను మీద ఇల్లు కట్టుకోవచ్చు. మూడంతస్తులు వేసి.. పై పోర్షన్‌లో మీరు ఉండి, మిగతావి అద్దెకిస్తే.. తిని కూర్చోవచ్చు! ఏమంటారు?' అన్నాడు. మామగారి ఆలోచన సబబుగానే తోచింది పరశురామ్‌కు. తల్లి బోధతో అతని భార్య కూడా ఆలోచించండి అన్నట్టుగా చూసింది.


**కోరికలు.. ఫిర్యాదులు..**

ఇల్లు కట్టాలని ఫిక్సయిన పరశురామ్ అప్పటి వరకు తను కూడబెట్టుకున్న డబ్బంతా వెలికితీశాడు. ఈపీఎఫ్‌లో ఉన్న మొత్తాన్ని తీసుకున్నాడు. కొంత బంగారం కుదువపెట్టాడు. వెంచర్‌లో చిన్న స్థలాన్ని అమ్మేసి రూ.కోటి సర్దుబాటు చేసుకున్నాడు. ఆ మొత్తంతో నగర శివారులో 220 గజాల స్థలం కొన్నాడు. బిల్డర్‌ను సంప్రదిస్తే మరో కోటితో జీం2తోపాటు పైన పెంట్‌హౌజ్ నిర్మించేలా ఒప్పందం చేసుకున్నాడు. బ్యాంకులో రూ.1.20 కోట్లు గృహరుణం తీసుకున్నాడు. అప్పటికే 45 ఏండ్లు ఉండటంతో, లోను టెన్యూర్ 15 ఏండ్లు పెట్టుకున్నాడు. ఈఎమ్‌ఐ రూ.1.20 లక్షలుగా ఫిక్సయింది. అంటే అతని జీతంలో సగం వాయిదాకు చెల్లించాలని ఫిక్సయ్యాడు! ఇల్లు పూర్తయింది. ఆరు పోర్షన్లు అద్దెకిస్తే నెల తిరిగేసరికి రూ.60వేలు వసూలు అవుతున్నాయి. పరశురామ్ ఆనందానికి అవధుల్లేవ్. మూడు నెలలు గడిచాయో లేదో.. అద్దెదారులు పరస్పరం గొడవలకు దిగడం, తీర్పు కోసం పరశురామ్ తలుపు తట్టడం కామన్ అయిపోయింది. తప్పు చేసిన వారిని ఇల్లు ఖాళీ చేయించడమో, అలా చేయలేకపోతే తమదే ఒప్పు అనుకున్న వాళ్లు మరో ఇంటికి మకాం మార్చడమో జరుగుతూ వచ్చింది. ఆరు పోర్షన్లలో ఎప్పుడూ రెండు ఖాళీగానే ఉంటున్నాయి. ఇది చాలదన్నట్టు.. నీళ్లు రావడం లేదనీ, కరెంట్ బిల్లు ఎక్కువగా వస్తున్నదనీ, మంచి నీళ్లు పైకి వచ్చేలా ఏర్పాటు చేయమనీ, వాష్‌రూమ్‌లో నీళ్లు పోవడం లేదనీ.. ఇలా రోజుకో ఫిర్యాదు రావడం మొదలైంది. వాళ్ల కోరికలు మన్నించలేక, ఫిర్యాదులు పరిష్కరించలేక.. పరశురామ్‌కు సొంతింట్లో ఉంటున్న ఆనందం రెండేండ్లకే ఆవిరైంది. అప్పటి వరకు తన దగ్గర ఉన్నదంతా ఊడ్చిపెట్టి, బ్యాంకు లోను తీసుకుని ఇల్లు కట్టుకున్నాడు. రిటైర్ అయ్యాక అద్దెల ద్వారా వచ్చే ఆదాయంతో బతుకు వెళ్లదీయొచ్చు అని భావించాడు. కానీ, వెలకట్టలేని మనశ్శాంతిని దూరం చేసుకున్నాడు. పైగా, బీపీ షుగర్ లెవల్స్ పెరిగాయి. ఆరోగ్యం నిదానంగా దెబ్బతినడం మొదలైంది. ఈఎమ్‌ఐ భారంతో పిల్లల పైచదువులప్పుడు పూర్తి స్థాయిలో అండగా నిలవలేకపోయాడు. స్పష్టంగా చెప్పాలంటే.. రెండు కోట్లకుపైగా ఇన్వెస్ట్ చేసిన యజమాని కాస్త ఆ ఇంటికి వాచ్‌మ్యాన్‌గా మారిపోయాడు. ఇప్పుడు మీరు ఆలోచించండి.. రూ.2.20 కోట్ల పెట్టుబడి పెట్టి.. ఇల్లు తీసుకున్న వ్యక్తి దర్జాగా బతక్కుండా, ఇలా నీరుగారిపోవడాన్ని ఏ ఆర్థిక సూత్రం మాత్రం ఆమోదిస్తుంది. ఇదే పరశురామ్ రూ.కోటితో ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌గానీ, అదే నగర శివారులో డూప్లెక్స్ ఇల్లు గానీ తీసుకుంటే.. 'అనుభవించు రాజా!' అని పాడుకుంటూ లైఫ్ ఎంజాయ్ చేసేవాడు. తానొకటి తలస్తే విధి మరొకటి తలచింది. శాశ్వత ఆదాయం మాయలోపడి జీవితంలో ప్రశాంతతకు దూరం అయ్యాడు. అప్పటి వరకు తన దగ్గర ఉన్నదంతా ఊడ్చిపెట్టి, బ్యాంకు లోను తీసుకుని ఇల్లు కట్టుకున్నాడు. రిటైర్ అయ్యాక అద్దెల ద్వారా వచ్చే ఆదాయంతో బతుకు వెళ్లదీయొచ్చు అని భావించాడు. కానీ, వెలకట్టలేని మనశ్శాంతిని దూరం చేసుకున్నాడు. పైగా, బీపీ షుగర్ లెవల్స్ పెరిగాయి. ఆరోగ్యం నిదానంగా దెబ్బతినడం మొదలైంది. ఈఎమ్‌ఐ భారంతో పిల్లల పైచదువులప్పుడు పూర్తి స్థాయిలో అండగా నిలవలేకపోయాడు.

# పేరులోనే అంతా ఉంది




మార్పు శాశ్వతం అనే చమత్కారాన్ని మనం తరచూ వింటూనే ఉంటాం. తెలుగు సాహిత్యంలో ఈ మార్పును కవులు బాగానే ఒంటపట్టించుకున్నారు. ముఖ్యంగా తమ కవిత్వ సంకలనాల శీర్షికల విషయంలో ఈ మార్పు కనిపిస్తుంది. ఇంతకుముందు అంటే రెండు, మూడు దశాబ్దాల క్రితం అన్నమాట.. కవిత్వ సంకలనాలకు మూస టైటిళ్లు ఉండేవి. తాము రాసిన కవితల్లో ఓ కవిత పేరే సంకలనానికి పెట్టేవారు. ఇది ఇప్పుడూ కొనసాగుతోంది కానీ, ఆ కవితకు పెడుతున్న శీర్షికే కొత్తగా, ఆకర్షణీయంగా ఉంటోంది. ముఖ్యంగా ఓ దశాబ్దం నుంచి కవుల్లో ఈ మార్పు చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ఇదే మార్పు కోరిన తరంగా కనిపిస్తోంది. 'ఒక వెళ్లిపోతాను' అని ఎం.ఎస్.నాయుడు తన కవిత్వ సంకలనానికి అందులోని ఒక పద్యం పేరే పెడితే తెలుగు సాహిత్య లోకమంతా చాలా ఆశ్చర్య పోయింది. ఆ కవిత్వ సంకలనాన్ని ఆవిష్కరించిన ప్రముఖ కవయిత్రి విమల అయితే, ఆ పేరు చూసి కవిత్వంలో ఎన్ని మార్పులు వస్తున్నాయో అని ఆశ్చర్యచకితులయ్యారు. ఆ సభలోనే విమల మాట్లా డుతూ ఒక్క లైనులోనే ఓ కవితను చెబుతున్న వారూ ఉన్నారన్నారు. ఇదీ నేటి కవిత్వ భాష. ఇక ప్రసేన్ అయితే తన మూడు కవిత్వ సంకలనాలకు పెట్టిన పేర్లు చూసి ఆ కవిత్వం చదవాలనిపిస్తుంది. (కొనాలనిపిం చదు. కొట్టేసి చదవాలనిపిస్తుంది). ప్రసేన్‌కు జర్నలిస్టుగా అనుభవం ఎక్కువే కాబట్టి, అక్కడ హెడ్డిం గులు పెట్టినట్టే తన కవిత్వ సంకలనాలకు కొత్తకొత్త పేర్లు పెట్టి పాఠకులను తన వైపు తిప్పుకునేలా చేస్తున్నారా యన. అంటూ కార్పొరేట్ ప్రకటనలు వస్తున్నాయి కానీ, తెలుగు కవిత్వాన్ని మాత్రం ఆ కవర్ పేజీ, ముఖ్యంగా ఆ సంకలనానికి పెట్టిన పేరుని బట్టే చదువుతున్నారు. అంతేకాదు.. పుస్తక ప్రదర్శనల్లో కొంటున్నారు కూడా. ప్రసేన్ తన కవిత్వ సంకలనాలకు పెట్టిన పేర్లు కొందరికి కొత్తగా అనిపిస్తే%ా% ఇంకొందరికి మాత్రం గమ్మత్తుగా అనిపించాయి. నాకు భలే నచ్చాయి ఆ పేర్లు. ప్రసేన్ రాసిన ఓ కవిత్వ సంకలనం పేరు 'ఇంకా వుంది'. సృజనకారులకు ఎందులోనూ ముగింపు ఉండదు. కవి అనండి, రచయిత్రి కానివ్వండి ఏది రాసినా అంతా అసంపూర్ణమే. వాళ్లు చెప్పేందుకు ఇంకా చాలానే ఉం టుంది. బహుశా అందుకు సంకేతమే ఈ 'ఇంకా వుంది'. ఇలాంటి తాత్వికతే మరో రెండు సంకలనాల టైటిళ్లలోనూ కనిపిస్తుంది. అందులో ఒకటి 'ఎవరికి వర్తి స్తే వారికి'. ఈ కవిత్వం చదవడానికి కాసింత ధైర్యం కావాలనిపిస్తుంది. ఆ సంకలనం తెరిస్తే 'మన గురించి, మనల్ని ఉద్దేశించి ఏమైనా రాశారా, మనల్ని మన అద్దం లో చూపించారా!? లేదా తన అద్దంలో చూపిం చారా!?' అనే సంశయం ప్రారంభమవుతుంది. ఏది కనిపించినా అది ఎవరికి వర్తిస్తే వారికి అలా సీనియర్ కవిగా గుర్తింపు పొందిన జూకంటి జగన్నా థం తన కవిత్వ సంకలనాలకు పెట్టిన పేర్లు కూడా భలే గమ్మత్తుగా ఉంటాయి, బాగుం టాయి. ఈ మధ్య ఖమ్మం ఈస్థటిక్స్‌వారు ఉత్తమ కవిత్వ సంకలనంగా జూకంటి రాసిన 'ఒక కప్పు చాయ్ నాలుగు మెస్సేజ్ లు'కే ప్రకటించారు. ఈ సంకలనానికి అవార్డు ప్రకటించారని తెలియగానే తొలు త ఆశ్చర్యపోయాను. జూకంటి ఇప్పటి కవి కాదు. ఇంతకుముందు కూడా తన కవిత్వ సంపుటాలకు 'ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' అని, 'వాస్కో డిగామా డాట్‌కామ్' అని సరికొత్త పేర్లు పెట్టారాయన. అంటే నేటి తరంతో నాటి జూకంటి అప్‌డేట్ అవుతు న్నారనిపించింది. ఊరికే పేరేనా లోపల విషయం ఉందా అని చూస్తే చాలానే ఉందనిపిస్తుంది. ఈ కప్పు చాయ్ పద్యం 'వన్నెల వెన్నెలని చూడలేదు/ ఉదార హృదయాన్ని కనలేదు' అంటూ ప్రారంభమై మధ్యలో 'ఏమరుపాటుగా కుర్చీలో కూర్చుని/ ఒక కప్పు చాయ్ సిప్ చేస్తూ/ సెల్‌లో ఎంగిలి మెసేజ్‌లు చదువుతూ/ కొత్త ప్రపంచంలోకి ప్రవేశం/ కాకిలగ్గం డేటింగ్ చాటింగ్ చేస్తుంటాడు' అంటారు. ఎంత గొప్పగా వెటకరించారు సెల్‌ఫోన్‌లే లోకంగా బతుకుతున్న నేటితరాన్ని. కవులే కాదు.. కవయిత్రులు కూడా తమ సంకలనాలకు సరికొత్త పేర్లు పెడుతూ పాఠకులకు చేరువవుతున్నారు. తోట సుభాషిణి 'ఒకటి ఒకటి పదకొండు', మందరపు హైమావతి 'రాతిచెయ్యి' కవిత్వ సంకలనాలు తీసుకొచ్చారు. తన కవిత్వ సంకల నాలకు 'లోహనది', 'మరో దశ' వంటి సీరియస్ పేర్లు పెట్టిన వసీరా మూడో సంకలనానికి మాత్రం 'సెల్ఫీ' అని నామకరణం చేశారు. ఇది తన మూడు దశాబ్దాల కవిత్వ ప్రయాణంలో తానే తీసుకున్న సెల్ఫీ. ఎప్పుడూ అచ్చమైన కవిత్వం రాసే పసునూరి శ్రీధర్‌బాబు 'నిద్రపోని మెలకువ చెప్పిన కల' అంటూ పొయెటిక్ సంకల్పం చెప్పుకొన్నారు తన కొత్త కవిత్వానికి. తెలుగు సాహిత్యంలో చాలామందికి గురుస్థానంలోకి వచ్చిన సీనియర్ కవి శివారెడ్డి అయితే పొసగనివన్నీ కలిపి ఓ కవిత్వ సంకలనం వేశారు. అది కూడా దశాబ్దంన్నర క్రితమే. అలాగే 'పక్కకు వొత్తిగిల్లితే' ఏం జరుగుతుందో కూడా శివారెడ్డే చెప్పారు. ఎనిమిది పదుల వయసులోకి వచ్చాక అసలు సిసలు ప్రేమని కనుగొని దానికి '%ూానవ ుశీ వాశీజవ% అను ప్రేమగీతం' పాడారు. ఇంకా చాలామంది తమ కొత్త శీర్షికలు, కవిత్వ సంకలనాల పేర్లతో తెలుగు కవిత్వాన్ని వినిపిస్తున్నారు. 'పేరులోన ఏముంది' అన్నమాట కాదు నేడు వినిపిస్తున్నది.. 'పేరులోనే అంతా ఉంది' అన్నదే నేడు వినిపిస్తున్న కవిత్వం.



# ఆత్మ నివేదన

గత 127 వారాలుగా 'కాశీమజిలీ కథలు' అనుసృజనను ఆదరించిన పాఠకులకు ధన్యవాదాలు. 1930వ దశకంలో 12 భాగాలుగా మధిర సుబ్బన్న దీక్షితులు రచించిన కాశీమజిలీ కథల విశిష్టతను గురించి, ఈ అనుసృజనలో ఆ కథలను చెప్పేందుకు అనుసరించిన నిబంధనలను గురించి క్లుప్తంగా తెలియచేస్తూ.. ఈ శీర్షికను ఇంతటితో ముగిస్తున్నాం. తెలుగులో కాశీమజిలీ కథలకున్న ప్రాచుర్యం మరి దేనికీ లేదు. సంసార వ్యామోహాన్ని విడిచిపెట్టి సన్యాసం స్వీకరించిన మణిసిద్ధుడు అనే యతి.. కాశీయాత్ర చేయాలని నిశ్చయించుకుంటాడు. అయితే యాత్రలకు ఒంటరిగా వెళ్లరాదనే నియమాన్ని పురస్కరించుకుని, తనకు తోడుగా రమ్మని ఒక గోపాలకుణ్ని కోరుతాడు. కథలంటే మక్కువ కలిగిన ఆ గోపాలకుడు.. 'దారిలో కనిపించే విశేషాలన్నిటినీ నాకు విడమరిచి చెబితేనే మీతో వస్తా!' అని షరతు పెట్టాడు. మణిసిద్ధుని వద్ద ఒక అపురూపమైన మణి ఉంది. దాని సాయంతో దారిలో కనిపించిన ప్రతి విశేషాన్ని తెలుసుకుని, ఎప్పటికప్పుడు మణిసిద్ధుడు ఆ గోపాలకుడికి కథలు కథలుగా చెబుతాడు. అవే కాశీ మజిలీ కథలు. 1930వ దశకంలో మధిర సుబ్బన్న దీక్షిత కవి రచించిన కాశీమజిలీ కథలు తెలుగు పాఠకలోకాన్ని ఉర్రూతలూగించాయి. చిన్నా పెద్దా తేడాలేకుండా, పండిత పామరులనే భేదం లేకుండా.. ఒకప్పుడు తెలుగు వారందరూ కాశీమజిలీ కథలను ఆస్వాదించినవారే! పూర్తి జానపద శైలితో సాగినప్పటికీ, సామాన్యులకు అంతగా రుచించని వేదాంత, వ్యాకరణాది అంశాలను పరమార్థ బోధారూపంగా అందించిన అద్వితీయ రచన కాశీమజిలీ కథలు. మధిర సుబ్బన్న దీక్షితులు ఈ కథలను రచించేనాటికి తెలుగులో నవలలు లేవు. చిన్నవైనా, పెద్దవైనా కథలు మాత్రమే! కాశీమజిలీ కథల్లో 359 మజిలీలు ఉంటాయి. ఆ మజిలీలన్నిటిలో 'కథ' అనే పేరు కనిపిస్తుంది. లెక్కకు మిక్కిలిగా కథలుంటాయి. ఉదాహరణకు మొదటి సంపుటంలో వరప్రసాదుల కథ ఉంటుంది. ఇది అయిదుగురు స్నేహితుల కథ. ప్రధాన కథ ఇదే అయినప్పటికీ.. వేర్వేరు శీర్షికలకు కూడా కథ అనే పేరుతోనే పేర్కొన్నారు. ఈ అనుసృజనలో ప్రతిభాగానికీ వేర్వేరు శీర్షికలను ఉంచినప్పటికీ ప్రధాన కథ ప్రారంభాన్ని, ముగింపునీ తప్పనిసరిగా తెలియచేశాం. ఆవిధంగా చూస్తే ఇప్పటివరకు 28 కథలను మీరు చదివారు. ఇంకా మిగిలిన కథలేమయ్యాయి?! వాటిని ఎందుకు చెప్పలేదు!? అనే విషయాన్ని కూడా ఈ సందర్భంగా స్మరించాల్సి ఉంది. కాశీమజిలీల్లో ప్రధాన కథ ఎప్పుడూ మణిసిద్ధుడనే యతి.. గోపాలకుడనే సహాయకుడికి బోధించినట్లుగా మొదలవుతుంది. కథలో చర్చించబోయే విషయాన్ని నాటకఫక్కీలో ముందుగా వారిద్దరి మాటల్లో చర్చించారు. అయితే ఈ అనుసృజనలో వారిద్దరి పాత్రలనూ పక్కన పెట్టినప్పటికీ అసలు స్మరించకుండా ఉండలేదు. ఇక, వరప్రసాదుల కథలోనే కృష్ణదేవరాయల వృత్తాంతం ఇమిడి ఉంటుంది. కృష్ణరాయని కథను కమనీయ కావ్యంగా తీర్చిదిద్దిన రచయిత, అందులోనే తిమ్మరుసు కథ, గజపతులతో సంబంధం వగైరా కథలను హేతుబద్ధంగానూ, చరిత్రకు అందే విధంగానూ రచించారు. అయినప్పటికీ ఈ అనుసృజనలో చారిత్రక పురుషులపై వచ్చిన కథలను తప్పించడం జరిగింది. కాశీమజిలీ కథలను మధిర సుబ్బన్న దీక్షితులు.. 1. జానపద ఇతివృత్తాలు, 2. చారిత్రక ఇతివృత్తాలు, 3. కావ్యకథలు, 4. పౌరాణిక కథలు అనే విభాగాల నుంచి స్వీకరించి రచించారు. ఇందులో ఇప్పటివరకు మనం జానపద ఇతివృత్తాలను మాత్రమే చదువుకున్నాం. కృష్ణరాయని కథతో పాటుగా.. జగన్నాథ పండితరాయలు, తెనాలి రామలింగడు వంటి చారిత్రక పురుషుల కథలను అప్పటి పండిత పామరులను రంజింపచేసే విధంగా సుబ్బన్న దీక్షితులు రచించారు. అవి ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని అధ్యయనం చేసేవారికి బాగుంటాయి. జనబాహుళ్యాన్ని కాస్త తికమక పెడతాయి. కనుకనే వాటిని విడిచిపెట్టడం జరిగింది. రెండో సంపుటంలో పూరీ జగన్నాథుని అవతార నేపథ్యానికి సంబంధించిన ఇంద్రద్యుమ్న మహారాజు వృత్తాంతాన్ని యథాతథంగా వర్ణించాం. 8వ సంపుటిలోని పౌరాణికమైన మదాలస కథను చెప్పాం. పురాణ పాత్రల నేపథ్యాలతో వచ్చిన మరికొన్ని కథలనూ చెప్పాం. విక్రమార్కుడు ఉట్టికోసిన కథ, భేతాళుని వశం చేసుకున్న కథ ఒక క్రమపద్ధతిలో లేవు. అవన్నీ ఇతరత్ర బహుళ ప్రాచుర్యంలో ఉన్నవే. కాశీమజిలీల్లోనివే అయిన విక్రమార్కుని మనుమని కథను చదువుకున్నాం. కానీ, అతను పాతాళానికి వెళ్లి విభీషణుడు మొదలైన రాక్షసులను కలుసుకోవడం వగైరా కథలను నేటితరం వారికి ఓ పట్టాన కొరుకుడు పడవు కనుక, విడిచిపెట్టాం. వీణావిద్వాంసుని కథ చాలా చిన్నదే కానీ, మజా కలిగించే కథ కాదు. నాలుగు కులాలకు చెందిన నలుగురు కన్యలు ఒకే వరుణ్ని వరించిన కథను కూడా ఈ శీర్షికలో చెప్పలేదు. 5వ సంపుటిలోని శంకరవిజయాన్ని ఈ అనుసృజనకారుడు గతంలో నవలగా రచించారు. కనుక ఇక్కడ మళ్లీ చెప్పలేదు. అలాగే అదే సంపుటిలోని కాదంబరి అనే కావ్యకథను కూడా విడిచిపెట్టాం. ఈ అనుసృజనలో మూలంలోని వర్ణనాసౌందర్యాన్ని చెడగొట్టలేదు. ఏ ముఖ్యవిషయాలు చెప్పడం ద్వారా పాఠకుల స్థాయి పెరిగేలా మూలకర్త వాటిని రచించారో.. వాటిని చెప్పకుండా వదిలి పెట్టలేదు. కాశీమజిలీ కథలకు రెండో మూడో సరళ అనువాదాలు వచ్చాయి. ఇందులోని అనేక కథలను విఠలాచార్య వంటివారు పలు సినిమాల్లో ఉపయోగించుకున్నారు. జగదేకవీరుని కథ, చిక్కడు దొరకడు.. వంటి హిట్ సినిమాలు కాశీమజిలీల్లోని ముఖ్యమైన థాట్‌ని ఉపయోగించుకుని చేసిన కథలే. కాశీమజిలీలను రూపొందించడంలో మధిర సుబ్బన్న దీక్షితకవి చూపించిన రచనా నైపుణ్యం అనితర సాధ్యం. అయినప్పటికీ ప్రతికథకూ ప్రాచీన సాహిత్యపు మూలాలు కూడా కొన్ని ఉన్నాయి. ప్రధానంగా కథాసరిత్సాగరం కనిపిస్తుంది. అలాగే సంస్కృత కావ్యాలలోని కథలను తనదైన భాషలోకి మలుచుకుని, గమ్మత్తయిన మలుపులతో మధిర సుబ్బన్న దీక్షితులు ఆరోజుల్లో ఆబాలగోపాలాన్ని అలరించారు. నేటికీ ఈ కథలు వీటికివే సాటి అని చెప్పుకోవాలి. ఈ అనుసృజనకు ఇది చివరి భాగం. కాశీమజిలీల్లోని తొలిభాగం మణిసిద్ధుడనే యతికి, గోపాలకుడికి మధ్య సంభాషణతో మొదలు అవుతుంది. 12వ సంపుటిలో కాశీమాహాత్మ్య గాథలుంటాయి. అవన్నీ మన పౌరాణికాలను పరమార్థ బోధారూపంగా చెప్పినవి. కాశీఖండం నుంచి స్వీకరించిన దివోదాసు కథ ప్రత్యేకంగా ఇందులో వర్ణించారు. ఈ కథ పద్మకల్పంలోని స్వాయంభువ మనువు కాలానికి చెందినది. అప్పట్లో అరవై ఏళ్లపాటు భూమిపై అనావృష్టి సంభవించింది. పాడిపంటలు నశించాయి. ప్రజలు విశూచి, మశూచి మొదలైన దారుణ రోగాలపాలయ్యారు. ప్రజలు కోటానుకోట్లుగా మరణిస్తుండగా, యమధర్మరాజు విసిగిపోసాగాడు. యజ్ఞయా గాదికాలు చెడ్డాయి. మానవులకు కలుగుతున్న అన్యాయానికి ఇంద్రాదులను నిలవేసి అడిగేవారే కరవయ్యారు. ఈ విశేషాలన్నీ నారదుడి వల్ల విన్న బ్రహ్మదేవుడు.. స్వాయంభువ మనువు వంశంలో పుట్టిన రిపుంజయుణ్ని ధరణీచక్రాన్ని పాలించవలసిందిగా నియమించాడు. రిపుంజయుని పేరును దివోదాసుగా మార్చాడు. అయితే దివోదాసు ఒక షరతు పెట్టాడు. "దేవతలకు స్వర్గం, నాగులకు పాతాళం ఉండగా.. వారు ఈ భూమిమీద ఎందుకు సంచరించాలి? వాళ్లు భూమి వదిలిపోవాలి. నేను కాశీని రాజధానిగా పాలిస్తాను.. కనుక శివుడు కూడా అక్కడినుంచి వెళ్లిపోవాలి" అన్నాడు. బ్రహ్మదేవుడు అతని కోరికను శివునికి విన్నవించగా.. "బ్రహ్మా! నీవు చేసిన నిర్ణయానికి కట్టుబడి.. నేను మందర పర్వతానికి వెళ్లిపోతాను. నేను తిరిగి వచ్చేదాకా ఈ ధరణీచక్రాన్ని దివోదాసుడే ఏలనీ" అన్నాడు. దివోదాసు అధికారం చేపట్టగానే నేలపై పాతాళవాసులను తరిమికొట్టాడు. తన బలంతో వర్షదేవతలను శాసించి వర్షాలు కురిపించాడు. దాంతో భూమి సస్యశ్యామలమైంది. నేలపై ధర్మం నాలుగు పాదాలతో నడవ సాగింది. కొంతకాలం జరిగిన పిమ్మట దివోదాసు రాజ్యంలో పుట్టలోని పామువల్ల పుత్రుణ్ని పోగొట్టుకున్న ఆటవికులు న్యాయంకోసం అతని వద్దకు వచ్చారు. వారికి ఆ పుత్రుణ్ని తిరిగి ఇచ్చే నిమిత్తం.. దివోదాసు కథంతా చిత్రవిచిత్రాలతో సుబ్బన్న దీక్షితులుగారి శైలిలో సుందరంగా సాగుతుంది. ఆ కథలో భాగంగా రసాతలం నుంచి నాగులు, యక్షులు మొదలైనవారంతా భూమిపై నివసించడానికి తగిన అనుమతిని దివోదాసు మంజూరు చేశాడు. కానీ, దేవతలను మాత్రం రానివ్వలేదు. కాశీని విడిచి ఉండటం ఇష్టంలేని దేవతలు బృహస్పతికి మొరపెట్టుకున్నారు. ఆయన సూచన మేరకు భూలోకంలో అగ్నిదేవుడు తన తత్వాన్ని ఉపసంహరించాడు. వాయువు స్తంభించాడు. వరుణుడు వర్షించడం మానేశాడు. దేవతల కపటం గ్రహించిన దివోదాసు, తన యోగవిద్యాబలంతో తానే సర్వదేవతామయునిగా మారిపోయాడు. రాజ్యాన్ని ఎప్పటిలా పాలించసాగాడు. కాశీనగరం శివుని నివాసభూమి. ఆయన కాశీవియోగాన్ని సహించలేక ముందుగా అరవైనాలుగు మంది యోగినీస్త్రీలను కాశీకి పంపాడు. వారు కాశీలో స్థిరపడిపోయారు. ఆలస్యం భరించలేక, శివుడు తరువాత సూర్యుడిని పిలిచాడు. "దివోదాసును ఏదోవిధంగా ధర్మవిముఖుడిని చేయి" అని కోరాడు. కానీ ఆ పని సూర్యుడివల్ల కూడా కాలేదు. అటుపై ఈశ్వరుని ఆజ్ఞపై బ్రహ్మ బ్రాహ్మణ వేషంలో కాశీకి వెళ్లి.. దశాశ్వమేధ యాగాలతో ఈశ్వరుడిని ప్రతిష్ఠించి.. గంగానదికి పడమటి తీరంలో ఉండసాగాడు. కానీ, కాశీని విడిచిపెట్టి వెనక్కు రాలేకపోయాడు. ఆ తరువాత ప్రమథులు కూడా వెళ్లి.. ఆ క్షేత్రంలోని అద్భుతానందాన్ని అనుభవిస్తూ అక్కడే ఉండిపోయారు. అప్పుడు ఢుంఠి భట్టారకుడై గణపతి వెళ్లాడు. అతడు కాశీవాసులకు అనేక దుశ్శకునాలు కల్పిస్తూ, వాటికి శాంతులు కూడా తెలియచేయసాగాడు. ఒకనాడు ఢుంఠి భట్టారకుని దర్శనానికి దివోదాసు వెళ్లాడు. "కాశీ ప్రజలకు ఉత్పాతాలు రావడానికి కారణం ఏమిటి?" అని ప్రశ్నించాడు. అప్పుడు భట్టారకుడు.. "ఇటుపైన ఇంకా ఉత్పాతాలు రావడానికి అవకాశముంది. వాటిని నేను ఉపశమింప చేయగలను. కానీ, నువ్వు ఇక్కడ ఉండటం మంచిదికాదు. నేటికి పద్దెనిమిదో రోజున నీకోసం ఒక బ్రాహ్మణుడు వస్తాడు. అతడు చెప్పినట్లుగా చేయి" అని సూచించాడు. ఆయన చెప్పినట్లుగానే ఆ పద్దెనిమిది రోజులలో చాలా వింతలు జరిగాయి. విష్ణువే లక్ష్మీ గరుడ సమేతంగా దిగివచ్చాడు. వాళ్ల బోధలతో అధర్మం పెచ్చుపెరిగి పోయింది. పద్దెనిమిదో రోజున మధుసూదనుడు బ్రాహ్మణ వేషంలో దివోదాసుని కలుసుకున్నాడు. అప్పుడు విఘ్నేశ్వరుడు రాజు హృదయాన్ని ఆవేశించి ఉన్నాడు. "ఇన్నాళ్లూ నా రాజ్యంలో అకాల మరణాలు, వ్యాధులు, దారిద్ర్యం, ముసలితనం లేవు. ఎందుకో అవన్నీ ఇప్పుడు కలుగుతున్నాయి. నేను దేవతలను తృణీకరించిన అపరాధం తప్ప మరే దోషమూ ఎరుగను. ఇదంతా దేవతలు కల్పించిన నాటకంలా కనిపిస్తున్నది. ఏదేమైనా నేను చాలాకాలం రాజ్యం చేశాను. నా ఇంద్రియాలు విశ్రాంతి కోరుతున్నాయి. నేను మోక్షం కోరుకుంటున్నాను. ఏం చేయాలో సెలవియ్యండి" అని కోరాడు దివోదాసుడు. ఆపైన మధుసూదనుడు చెప్పినట్లుగా, కాశీలో లింగప్రతిష్ఠ చేశాడు. తన కొడుక్కి పట్టాభిషేకం చేసి, దైవభక్తిని ఉపదేశించాడు. తాను తపోవనానికి వెళ్లిపోయాడు. దివోదాసు వారణాసి వదిలేసి వెళ్లాడన్న వార్త విష్ణువు ద్వారా తెలుసుకున్న ఈశ్వరుడు తిరిగి వచ్చాడు. ఆయనతోపాటు సర్వదేవతలూ కాశీ చేరుకున్నారు. ఆనాటినుంచి ఈ భూమండలాన్ని దేవతలే పాలిస్తారని విశ్వేశ్వరుడు ప్రకటించాడు. దివోదాసు కథ తరువాత, కాశీమజిలీ కథల్లోని 12వ సంపుటిలో.. పుండరీకుని కథను వర్ణించారు. ఈ కథ మనందరం ఎరిగిన పాండురంగ మహత్యాన్ని చాటే పుండరీకుని కథ కాదు. వైకుంఠ సభలో ఈశ్వరుడి చేత శపించబడిన ఇంద్ర, చంద్రులు.. పుండరీక, కుమారకేసరులుగా జన్మించారు. పార్వతీదేవి శాపం వల్ల అహల్య, తార పాతాళంలో ఉదయసుందరి, తారావళులుగా పుట్టి, భూలోకంలో అనేక కష్టాలు పడ్డారు. పుండరీక, కుమారకేసరులను పెళ్లాడారు. వాళ్లే తరువాతి జన్మలో గంధర్వలోకంలో హంసుడికి మహాశ్వేతగా, చిత్రరథుడికి కాదంబరిగా.. ఈశ్వరుడి వరం వల్ల జన్మించారు. ఇంద్రచంద్రుల మరో రూపాలైన చంద్రాపీడ, పుండరీకులని వివాహమాడి సంతానం పొందగానే వారి శాపం తొలగిపోయింది. చంద్రుడి భార్య అయిన రోహిణి కూడా అతణ్ని మూడు జన్మలలోనూ అనుసరి ంచింది. కాశీమజిలీల్లో అటుపైన వైశ్వానర, నిరృతి, వరుణుడు మొదలైన దిక్పతుల పూర్వగాథలు ఉంటాయి. చివరిగా మణిసిద్ధుడు, గోపాలుడు కాశీపుర ప్రవేశం చేసి, అక్కడే స్థిరపడడంతో పన్నెండో భాగం పరిసమాప్తమైంది.

Published by R.S ROSHINE Printed by R.S. ROSHINE On behalf of R.S. ROSHINE Printed at J.M. Process, No 29, V.N. Doss Road, BorderThottam, Mount Road, Chennai - 600002. and Published From NO. 42/62, Buchammal Street, 1st Floor, New Washermenpet, Tondiarpet, Chennai, Tamilnadu - 600081. Editor: R.S. ROSHINE .

# సుంకాల తగ్గింపుతో ఎగుమతుల్లో భారత్ ఆధిపత్యం

**బంగ్లాదేశ్, చైనా, పాక్‌కు భారీ దెబ్బ**

**అమెరికాతో భారత్ కొత్త వాణిజ్య ఒప్పందం**

**ఆసియా ఎగుమతి మార్కెట్‌లో టాప్‌లో భారత్**



ప్రపంచంలోనే రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలైన భారత్-అమెరికా మధ్య నెలకొన్న వాణిజ్య ఒప్పందానికి ఎట్టకేలకు తెరపడింది. భారత్‌తో వాణిజ్య ఒప్పందాన్ని ట్రంప్ ప్రకటించారు. ఈ నిర్ణయంతో ఆసియా ఎగమతి మార్కెట్‌లో చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇన్నాళ్లు 50శాతం టారిఫ్‌లతో ఎగుమతుల్లో అమెరికా మార్కెట్‌కు దూరంగా భారత్, సుంకాల తగ్గింపుతో ముందంజలోకి దుసుకొచ్చింది.

**మొదటి స్థానంలో భారత్**

అమెరికా సవరించిన టారిఫ్‌లతో భారతీయ ఎగుమతిదారులకు ఏకంగా 32 శాతం పన్ను భారం తగ్గింది. ఇది భారత ఎగుమతులకు భారీ ఊరట అని చెప్పాలి. భారత్ ఆసియా ఎగుమతి మార్కెట్‌లో మొదటి స్థానంలో నిలిచింది. ఎగుమతుల్లో ప్రాంతీయ ప్రత్యర్థులైన చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంకల కంటే మెరుగైన స్థానంలో నిలిచింది. ఈ డీల్ ముందు వరకు ఆసియాలోనే భారీగా అమెరికా టారిఫ్‌లను ఎదుర్కొన్న దేశం భారత్. ఒక్కరాత్రిలో అది తలకిందులైంది. ఇప్పుడు 18శాతంతో అతి తక్కువ సుంకాలు విధిస్తున్న దేశాల జాబితాలో టాప్‌లోకి వచ్చేసింది. ప్రస్తుతం పాకిస్థాన్‌పై 19శాతం, శ్రీలంకపై 20శాతం, బంగ్లాదేశ్‌పై 20శాతం, వియత్నాంపై 20శాతం, ఇండోనేషియా, మలేసియా, థాయ్‌లాండ్‌పై 19శాతం చొప్పున, చైనాపై 34శాతం సుంకాలు అమల్లోకి ఉన్నాయి. చైనాపై భారత్ కంటే దాదాపు రెట్టింపు టారిఫ్‌లు అమల్లో ఉండటం గమనార్హం. అయితే ఆసియాలో అఫ్ఘానిస్థాన్ ఒక్కటే భారత్ కంటే తక్కువ టారిఫ్‌లు 15శాతం ఎదర్కొంటోంది. కానీ, ఆసియా ఎగుమతి మార్కెట్‌లో అఫ్ఘానిస్థాన్ భారత్‌కు ఏ మాత్రం పోటీ కాదు.

**భారత్‌కు ప్రయోజనాలు ఇవే**

టారిఫ్‌ల తగ్గింపుతో అమెరికా మార్కెట్లో భారతీయ ఉత్పత్తులు చౌకగా లభించి, ఎగుమతులు భారీగా పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, వస్త్రాలు, పాదరక్షల వంటి కీలక రంగాలలో వియత్నాం, బంగ్లాదేశ్‌లతో పోటీ పడుతున్న భారతీయ కంపెనీలకు భారీ ఊరట కలగనుంది. టెక్స్‌టైల్స్, జెమ్స్, జ్యువెలరీ, ఫార్మా రంగాలు అమెరికా మార్కెట్‌లో మరింత పోటీనిస్తాయి. సుంకాల సవరింపు తర్వాత ఆసియా ఎగుమతి మార్కెట్‌లో చైనాతో పోలిస్తే భారత్ ఇప్పుడు చాలా బలీయమైన స్థితిలో ఉంది, ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీలను తమ తయారీ కేంద్రాలను చైనా నుంచి భారత్‌కు మార్చేలా ప్రోత్సహిస్తుంది. భారత్ కూడా అమెరికా ఉత్పత్తులపై ఉన్న సుంకాలను, అడ్డంకులను తొలగించి, 'జీరో' స్థాయికి తీసుకెళ్లడానికి ఒప్పుకున్న నేపథ్యంలో ఇరు దేశాల వాణిజ్యం కొత్త పుంతల తొక్కనుంది.ప్రధాని నరేంద్ర మోదీతో జరిపిన 30 నిమిషాల ఫోన్ సంభాషణ అనంతరం, భారత్ నుంచి వచ్చే ఎగుమతులపై సుంకాలను 50శాతం నుంచి 18శాతానికి తగ్గిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. గత ఏడాది కాలంగా భారత్ నుంచి అమెరికాకు వెళ్లే ఉత్పత్తులపై మొత్తం 50 శాతం వరకు సుంకాల భారం పడుతోంది. ఇందులో 25శాతం పరస్పర సుంకాలు కాగా, రష్యా నుంచి ఆయిల్ కొంటున్నామన్న కారణంతో మరో 25శాతం టారిఫ్‌లను అదనంగా ట్రంప్ భారత్‌పై విధించారు. అయితే తాజా డీల్‌లో భాగంగా అదనపు సుంకాలను పూర్తిగా తొలగించిడమే కాకుండా, పరస్పర టారిఫ్‌లను 18శాతానికి తగ్గిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

**ఎక్స్ వేదికగా స్పందించిన ప్రధాని మోదీ**

సుంకాల తగ్గింపుపై ప్రధాని మోదీ కూడా స్పందించారు. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలు కలిసి చేస్తే, అది ప్రజలకు మేలు చేయడమే కాకుండా, పరస్పర ప్రయోజనకరమైన సహకారం కోసం అపారమైన అవకాశాలను కల్పిస్తుందన్నారు. ప్రపంచ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం ట్రంప్ నాయకత్వం చాలా కీలకమని వ్యాఖ్యానించారు. శాంతి కోసం ఆయన చేస్తున్న ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. ఇరు దేశాల భాగస్వామ్యాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు ట్రంప్‌తో కలిసి పని చేస్తామని చెప్పారు.

# వాట్సాప్ కు సుప్రీంకోర్టు సీరియస్ వార్నింగ్

**వ్యక్తిగత గోప్యత విషయంలో ఆటలొద్దు.. రాజ్యాంగాన్ని ఫాలో కావాల్సిందే**

**రూల్స్ అమలు చేయకుంటే దేశంలో నుంచి వెళ్లిపోండి**

**మెటాకు హెచ్చరికలు జారీ చేసిన అత్యున్నత న్యాయస్థానం**



భారత పౌరుల వ్యక్తిగత గోప్యత విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడబోమని దేశ అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. దేశంలో వ్యాపారం చేయాలంటే భారత రాజ్యాంగాన్ని గౌరవించాల్సిందేనని, రాజ్యాంగ విలువలను, నిబంధనలను పాటించి తీరాలని స్పష్టం చేసింది. రాజ్యాంగ నిబంధనలను పాటించకుంటే దేశం విడిచి వెళ్లాల్సిందేనని వాట్సాప్ మాతృసంస్థ మెటాకు సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. ఈ మేరకు ఈ రోజు జరిగిన విచారణలో వాట్సాప్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వ్యక్తిగత గోప్యత ఉల్లంఘనల విషయంలో వాట్సాప్ తీరుపై అత్యున్నత న్యాయస్థానం ఫైర్ అయింది. వాట్సాప్ యూజర్ల వివరాలను, డేటాను మెటాతో పంచుకునేందుకు వీల్లేదని స్పష్టం చేసింది.డేటా షేరింగ్, మార్కెట్ ఆధిపత్యానికి సంబంధించి గత నెలలో ఎన్సీఎల్టీ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వాట్సాప్, మెటా, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా సహా పలువురు దాఖలు చేసిన అప్పీళ్లపై సుప్రీం విచారణ జరిపింది. ఈ సందర్భంగా వాట్సాప్ పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ సీరియస్ వ్యాఖ్యలు చేశారు. 'మీరు మా దేశ పౌరుల గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలో ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేము అనుమతించబోము' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అమెరికా సంస్థ మెటాకు తేల్చిచెప్పారు.భారత చట్టాలను పాటించలేకపోతే దేశం వదిలి వెళ్లాలని సూచించారు. డేటా షేరింగ్ ఉండదని హామీ ఇవ్వాలని, లేదంటే ఈ కేసును కొట్టేస్తామని హెచ్చరించారు. చాట్ ట్రెండ్‌ల ఆధారంగా ప్రకటనలతో సహా వినియోగదారు డేటా ప్రవర్తన, వాణిజ్య దోపిడీ వినియోగదారుల హక్కులను ఉల్లంఘిస్తుందని కోర్టు తెలిపింది. వైద్యులతో ప్రైవేట్ చాట్‌ల తర్వాత వినియోగదారులు ఔషధాల కోసం ప్రకటనలను అందుకున్న సందర్భాలను కూడా గుర్తుచేసింది. ఇది డేటా మానిటైజేషన్ పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

# ఎల్ఐసీ మరోసారి వాటాల అమ్మకం- వచ్చే ఏడాదే ?

**బీమా దిగ్గజంలో ఎల్ఐసీ వాటాల ఉపసంహరణకు రంగం సిద్ధం**

**వచ్చే ఆర్థిక సంవత్సరంలోనే ప్రక్రియ షురూ**

**సంకేతాలిచ్చిన ఆర్థిక సేవల కార్యదర్శి**

**ప్రస్తుతం 96.5 శాతం వాటా సర్కార్ చేతిలోనే**




దేశీయ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ)లో తన వాటాను మరింత తగ్గించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 'ఫాలో-ఆన్ పబ్లిక్ ఆఫర్' ద్వారా వాటాలను విక్రయించే అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తోంది. ఈ విషయాన్ని ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి ఎం. నాగరాజు సోమవారం అధికారికంగా వెల్లడించారు. మార్కెట్ పరిస్థితులు అనుకూలిస్తే, వచ్చే ఏడాదిలోనే ఈ ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు.

**ఎంత వాటా అమ్మాలి?**

ప్రభుత్వం ఎందుకు వాటాలు అమ్మాలనుకుంటోందంటే, దానికి ప్రధాన కారణం సెబీ నిబంధనలు. ప్రస్తుతం ఎల్ఐసీలో ప్రభుత్వానికి ఏకంగా 96.5 శాతం వాటా ఉంది. మార్కెట్ నిబంధనల ప్రకారం, లిస్టెడ్ కంపెనీల్లో పబ్లిక్ షేర్ హోల్డింగ్ కనీసం 10 శాతానికి పెంచాల్సి ఉంది. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రభుత్వం మరో 6.5 శాతం వాటాను విక్రయించాల్సి ఉంటుంది. దీనికి గడువు 2027 మే నెలతో ముగుస్తుంది. అందుకే 2026-27 ఆర్థిక సంవత్సరంలోనే ఈ ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

**వచ్చే ఆర్థిక సంవత్సరంలోనే ఎఫ్‌పీవో?**

ఈ ప్రక్రియపై ఎం.నాగరాజు విలేకరులతో మాట్లాడారు. "ఎల్ఐసీ పబ్లిక్ ఆఫర్ అనేది తొందరపడి చేసేది కాదు. ఇది నెమ్మదిగా జరగాల్సిన ప్రక్రియ. వాటాల విక్రయంపై దృష్టి సారించాలని మేము ఇప్పటికే పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖను కోరాం. అన్నీ అనుమతులు వచ్చి, మార్కెట్ పరిస్థితులు బాగుంటే, వచ్చే ఆర్థిక సంవత్సరంలోనే ఎఫ్‌పీవో వచ్చే అవకాశం ఉంది" అని ఆయన వివరించారు. అయితే ఎంత వాటా అమ్ముతారు? ధర ఎంత ఉంటుంది? అనే విషయాలు వెల్లడించలేదు.

**గత ఐపీవో రికార్డు**

ఎల్ఐసీ గతంలోనే మార్కెట్లోకి వచ్చింది. 2022 మే నెలలో ఎల్ఐసీ ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్(ఐపీఓ) వచ్చింది. అప్పుడు ప్రభుత్వం తన దగ్గరున్న వాటాల్లో 3.5 శాతాన్ని విక్రయించింది. ఒక్కో షేరు ధరను రూ.902 నుంచి రూ.949 మధ్య నిర్ణయించింది. ఆ ఐపీవో ద్వారా ప్రభుత్వం ఖజానాకు ఏకంగా రూ.21,000 కోట్లు సమకూరాయి. అది దేశ చరిత్రలోనే అతిపెద్ద ఐపీవోలలో ఒకటిగా నిలిచింది.

**మార్కెట్ పరిస్థితి, ఆర్థిక ఫలితాలు**


ప్రస్తుతం ఎల్ఐసీ ఆర్థికంగా పటిష్ఠంగా ఉంది. సోమవారం బీఎస్ఈలో ఎల్ఐసీ షేరు ధర సుమారు రూ.804 వద్ద సెటిల్ అయ్యింది. ప్రస్తుతం సంస్థ మార్కెట్ విలువ రూ.5.08 లక్షల కోట్లుగా ఉంది. ఇక ఆర్థిక ఫలితాల విషయానికి వస్తే, ఎల్ఐసీ అదరగొడుతోంది. 2025 సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో (క్యూ2) సంస్థ నికర లాభం ఏకంగా 32 శాతం పెరిగింది. గత ఏడాది ఇదే సమయంలో రూ.7,621 కోట్లుగా ఉన్న లాభం, ఈసారి రూ.10,053 కోట్లకు చేరింది. కమిషన్ల చెల్లింపులు తగ్గడమే ఇందుకు ప్రధాన కారణం. సంస్థ మొత్తం ఆదాయం కూడా రూ.2.29 లక్షల కోట్ల నుంచి రూ.2.39 లక్షల కోట్లకు పెరిగింది.

# పెట్టుబడులు, వృద్ధి లక్ష్యంగా బడ్జెట్- అధిక ఉపాధి కల్పించే రంగాలపై దృష్టి

**నిర్మలా సీతారామన్**

**నిలకడైన వృద్ధి కీలకం- అందుకే బడ్జెట్‌లో పెట్టుబడులకు ప్రథమ ప్రాధాన్యం**

**కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి**



2026 కేంద్ర బడ్జెట్‌ను పెట్టుబడులు, వృద్ధి లక్ష్యంగా ప్రవేశపెట్టామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. నిలకడైన వృద్ధి సాధించడానికి బడ్జెట్‌లో పెట్టుబడులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చిమన్నారు. ముఖ్యంగా ఉపాధి కల్పన ఎక్కువగా ఉండే రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు.ఇక బంగారం ధరల్లో తీవ్ర ఒడుదొడుకులు రావడంపై ఆమె తనదైన రీతిలో స్పందించారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా ఉన్న అనిశ్చితి కారణంగానే పసిడి ధరల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయని అన్నారు. ఏ ఒక్క నిర్దిష్ట కరెన్సీపై కూడా పెట్టుబడిదారులకు పూర్తి నమ్మకం లేదని ఇది స్పష్టం చేస్తోందన్నారు.

**ట్రేడింగ్‌పై నియంత్రణ**

ఊహాజనిత ట్రేడింగ్‌పై నియంత్రణే తమ ప్రాధాన్యత అని నిర్మలమ్మ స్పష్టం చేశారు. ముఖ్యంగా డెరివేటివ్ ట్రేడింగ్‌లో ప్రజలు విచక్షణారహితంగా ఊహాజనిత లావాదేవీలు జరిపి నష్టపోకుండా నిరోధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆమె తెలిపారు. అందుకే ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్&ఓ)పై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ) పెంచామని పేర్కొన్నారు.

**పెట్టుబడుల ఉపసంహకరణ**

ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ, ఆస్తులను నగదుగా మార్చుకునే (అసెట్ మోనటైజేషన్) ప్రక్రియ వేగంగా జరుగుతోందని నిర్మలమ్మ తెలిపారు. ఇది కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల 'పబ్లిక్ ఫ్లోటింగ్'ను మరింత పెంచుతుందని ఆమె అన్నారు. పీఎస్‌యూ వాటాల విక్రయ వేగమే పన్నేతర ఆదాయాల దిశను నిర్దేశిస్తుందని ఆమె తెలిపారు. ప్రస్తుతం ఐడీబీఐ బ్యాంక్ నుంచి పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని ఆమె చెప్పారు.

**ఐబీసీ బిల్లు**

మార్చి 9న ప్రారంభం కానున్న రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్ట్సీ కోడ్ (ఐబీసీ) సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు నిర్మలా సీతారామన్ చెప్పారు. దీనికి సంబంధించి పార్లమెంటరీ కమిటీ ఇప్పటికే తన నివేదికను సమర్పించిందని తెలిపారు. ఈ సవరణ బిల్లు దివాలా పరిష్కార ప్రక్రియకు పట్టే సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుందని, అంతేకాకుండా వాటి ప్రభావాన్ని మరింత మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు. అలాగే భారతీయ దివాలా చట్టాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడానికి ఈ మార్పులు దోహదపడతాయని ఆమె అన్నారు.ప్రస్తుతం ఆమె కార్పొరేట్ వ్యవహారాల శాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న నిర్మలా సీతారామన్, "పరిస్థితులకు అనుగుణంగా, పార్లమెంటరీ కమిటీ చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ, మార్చి 9 ప్రారంభం కానున్న రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో ఈ ఐబీసీ సవరణ బిల్లును ప్రవేశపెడతాం" అని వెల్లడించారు.వాస్తవానికి 2016లో అమల్లోకి వచ్చిన ఐబీసీ చట్టానికి ఇదో 7వ సవరణ కావడం గమనార్హం. ఈ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 6సార్లు సవరణలు జరిగాయి. చివరిగా 2021లో దీనికి సవరణ చేశారు. తాజా సవరణ కనుక ఆమోదం పొందితే జవాబుదారీతనం బాగా పెరుగుతుంది. ఎలా అంటే, ఒక వేళ కంపెనీలు అప్పులు తిరిగి చెల్లించడంలో విఫలమైతే, ప్రమోటర్లు దివాలా చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అందువల్ల ఇది జవాబుదారీతనాన్ని పెంచుతుంది. 2025 ఆగస్టు 12న కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ఐబీసీ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. దివాలా పరిష్కార దరఖాస్తుల స్వీకరణకు పట్టే సమయాన్ని తగ్గించడం వంటి అనేక ప్రతిపాదనలు ఇందులో ఉన్నాయి. లోక్‌సభ సెలెక్ట్ కమిటీ పంపిన ఈ బిల్లుపై పార్లమెంటరీ కమిటీ 2025 డిసెంబర్‌లో తన నివేదికను సమర్పించింది.

**రూ.53.47 లక్షల కోట్ల బడ్జెట్**

ఆదివారం కేంద్ర వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టారు. వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశగా సంస్కరణల పథాన్ని కొనసాగింపునకే ఆమె మొగ్గుచూపారు. రూ.53,47,315 కోట్లతో 2026-27 వార్షిక బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఇందులో రెవెన్యూ రాబడులను రూ.35,33,150 కోట్లుగా అంచనా వేసిన ఆర్థిక మంత్రి, అందులో పన్నుల ద్వారా రూ.28,66,922 కోట్లు, పన్నేతర ఆదాయం ద్వారా రూ.6,66,228 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. మూలధన రాబడులను రూ.18,14,165 కోట్లుగా ప్రతిపాదించారు. మూలధన రాబడుల్లో రూ.16,95,768 కోట్లు అప్పులు ద్వారా సమీకరించనున్నట్లు వివరించారు.

# భారత్, అమెరికా ట్రేడ్ డీల్- దలాల్ స్ట్రీట్‌లో బుల్ రన్- సెన్సెక్స్ 2300 ప్లస్

**భారత్‌అమెరికా మధ్య కీలక వాణిజ్య ఒప్పందంపై ట్రంప్ సంతకం**

**భారీగా పెరిగిన మార్కెట్ సూచీలు**




భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు ప్రకటించిన వేళ దేశీయ స్టాక్‌మార్కెట్లు మంగళవారం భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. గ్లోబల్ పాజిటివ్ సంకేతాలు, ముఖ్యంగా భారత్‌అమెరికా మధ్య కీలక వాణిజ్య ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన ఇన్వెస్టర్లలో భారీ ఉత్సాహాన్ని నింపింది. ఫలితంగా మార్కెట్లు ఓపెనింగ్ నుంచే బుల్ రన్‌లోకి దూసుకెళ్లాయి.బీఎస్ఈ సెన్సెక్స్ 2,256 పాయింట్ల లాభంతో 83,935 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 699 పాయింట్లు పెరిగి 25,787 స్థాయిలో కదలాడుతోంది. ప్రీ-ఓపెనింగ్ సెషన్‌లోనే సెన్సెక్స్ 3,600 పాయింట్ల వరకూ ఎగబాకడం విశేషం. నిఫ్టీ 26,300 మార్క్‌ను తాకి రికార్డు స్థాయిని అందుకుంది. మార్కెట్ ప్రారంభం నుంచే అన్ని రంగాల్లో కొనుగోళ్లు జోరుగా కనిపించాయి.అమెరికా భారత్‌తో ట్రేడ్ డీల్‌కు అంగీకరిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించడంతో పాటు, భారత్ ఉత్పత్తులపై ఉన్న ప్రతీకార సుంకాలను 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్టు వెల్లడించారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై విధించిన అదనపు సుంకాలు కూడా ఈ తగ్గింపులో భాగం కావడంతో భారత ఎగుమతులకు పెద్ద ఊరట లభించనుంది. ఈ నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థకు గేమ్ చేంజర్‌గా మారుతుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.నిఫ్టీ సూచీలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్, జియో ఫైనాన్షియల్, బజాజ్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్ షేర్లు మంచి లాభాలు నమోదు చేశాయి. బ్యాంకింగ్, రియాల్టీ, ఆటో, ఐటీ, మెటల్ రంగాల షేర్లలో భారీ కొనుగోళ్లు జరిగాయి. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 2.5 శాతం పైగా ఎగబాకింది. ఐటీ సూచీ దాదాపు 5.8 శాతం పెరిగితే, ఆటో 5 శాతం, మెటల్ 3.8 శాతం, ఫార్మా 4.2 శాతం లాభపడింది. స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు కూడా 4 శాతం కంటే ఎక్కువగా పెరిగి విస్తృత ర్యాలీని సూచించాయి. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయకుమార్ మాట్లాడుతూ, ఈ ట్రేడ్ డీల్ భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద బూస్ట్ ఇస్తుందని చెప్పారు. అమెరికాకు ఎగుమతులు పెరగడంతో భారత్ వృద్ధిరేటు ఎఫ్27 నాటికి 7.5 శాతానికి చేరవచ్చని అంచనా వేశారు. కార్పొరేట్ లాభాలు 1618 శాతం వరకూ పెరిగే అవకాశం ఉందన్నారు. రూపాయి బలపడుతుందని కూడా తెలిపారు. ఇప్పటికే మార్కెట్‌లో భారీగా షార్ట్ పొజిషన్లు ఉండటంతో షార్ట్ కవరింగ్ కూడా ర్యాలీకి మరింత ఊతమిచ్చిందని విశ్లేషకులు చెబుతున్నారు. పెద్ద క్యాప్ స్టాక్స్‌లో విదేశీ పెట్టుబడులు పెరిగే అవకాశముందని, ముఖ్యంగా బ్యాంకింగ్, ఎన్‌బీఎఫ్‌సీలు, టెలికాం, క్యాపిటల్ గూడ్స్, ఐటీ రంగాలు ముందంజలో ఉండొచ్చని అంచనా.రూపాయి మారకం విలువ కూడా బలపడింది. డాలర్‌తో పోలిస్తే నిన్న 91.49 వద్ద ముగిసిన రూపాయి నేడు 90.30 స్థాయికి చేరింది. అంతర్జాతీయ పెట్టుబడిదారుల్లో పాజిటివ్ భావన పెరగడంతో కరెన్సీ మార్కెట్‌లో కూడా మెరుగైన ధోరణి కనిపిస్తోంది. అమెరికా మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగియగా, ఆసియా మార్కెట్లు కూడా అదే బాటలో పయనించాయి. జపాన్ నిక్కీ 3 శాతం, దక్షిణ కొరియా కోస్పీ 4 శాతం ఎగబాకాయి. ఈ గ్లోబల్ సానుకూలత దేశీయ మార్కెట్లకు అదనపు మద్దతు ఇచ్చింది.మొత్తానికి భారత్‌అమెరికా ట్రేడ్ ఒప్పందం మార్కెట్ సెంటిమెంట్‌ను పూర్తిగా మార్చేసింది. పెట్టుబడిదారుల విశ్వాసం పెరగడంతో రాబోయే రోజుల్లో కూడా మార్కెట్లు కొత్త రికార్డులను సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ర్యాలీ ప్రారంభం మాత్రమేనని, ముందున్న రోజుల్లో మరింత బలమైన బూమ్ కనిపించవచ్చని నిపుణులు భావిస్తున్నారు. దీంతో సూచీలు కొత్త రికార్డుల్లో పరుగులు పెడుతున్నాయి. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ సెన్సెక్స్ 2395 పాయింట్లు పెరిగి 84,062 వద్ద ట్రేడవుతోంది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ నిఫ్టీ 770 పాయింట్ల లాభంతో 25,852 వద్ద కదలాడుతోంది.


# మినిమం బ్యాలెన్స్ రూల్.. మూడేళ్లలో బ్యాంకులకు రూ.8 వేల కోట్ల ఆదాయం

**ఆధార్ తో పాన్ లింక్ రూల్ తో రూ.2 వేల కోట్లు**

**ట్యాక్స్ రిటర్న్ ఆలస్యం రూల్ ద్వారా రూ.7 వేల కోట్లు**

**ఛార్జీల రూపంలో బ్యాంకులకు వచ్చిన**

**ఆదాయం వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రి**




బ్యాంకు ఖాతాల్లో ఎల్లప్పుడూ మినిమం బ్యాలెన్స్ ఉంచాలని, ఆ మొత్తం లేకుంటే బ్యాంకులు ఛార్జీలు వసూలు చేస్తాయని తెలిసిందే. ఇలాంటి ఖాతాల నుంచి బ్యాంకులకు పెద్ద మొత్తం వచ్చిందని కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి తెలిపారు. మూడేళ్లలో 11 ప్రభుత్వరంగ బ్యాంకులకు ఇలా మినిమం బ్యాలెన్స్ ఛార్జీల కింద రూ.8,092 కోట్లు వసూలైందని చెప్పారు.2022-23లో రూ.2,407.82 కోట్లు, 2023-24లో రూ.2,909.1 కోట్లు, 2024-25లో రూ.2,775.91 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. ఇక, ఎస్ఎంఎస్ ఛార్జీల కింద కస్టమర్ల నుంచి రూ.3,387.77 కోట్లు, పాన్ - ఆధార్ కార్డు లింక్ లో జాప్యానికి ఆలస్య రుసుము కింద రూ.2,335.75 కోట్లు, ఆలస్యంగా రిటర్న్‌లు దాఖలు చేసిన వారి నుంచి ఫైన్ రూపంలో రూ.7,664.94 కోట్లు వసూలు చేసినట్లు లోక్‌సభలో మంత్రి వెల్లడించారు.

## ముందు కథలన్నీ రక్తపాతమే.. కానీ ఇది వేరు..



రాజేష్ మేరు, నవ్య చిట్యాల జంటగా కె. యశ్వంత్ కుమార్ సమర్పణలో వస్తున్న మూవీ 'లగ్గం టైం'. 20 సెంచ్యూరీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై కె.హిమ బిందు నిర్మించిన ఈ మూవీకి ప్రజోత్ కె వెన్నం దర్శకత్వం వహించారు. ఈ మూవీ ఫిబ్రవరి 6న రిలీజ్ కాబోతుండగా.. తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో రాజేష్ మేరు మాట్లాడుతూ.. "లగ్గం టైం' కథ కంటే ముందు నేను విన్న కథలన్నీ కూడా రక్తపాతంతో కూడుకున్నవే. కానీ ఈ కథ విన్న వెంటనే సినిమాని చేయాలని అనిపించింది. ఎంతో కష్టపడి ఈ మూవీని తీశాం. అందరినీ ఆకట్టుకుంటుంది.ఫిబ్రవరి 6న అందరూ చూసి సపోర్ట్ చేయండి' అన్నారు. నిర్మాత కె. హిమబిందు మాట్లాడుతూ .. 'ఎన్నో కష్టాలు, ఎంతో ఖర్చు పెట్టి 'లగ్గం టైం'ని నిర్మించాం. మా సినిమాని ఫిబ్రవరి 6న రిలీజ్ చేయబోతోన్నాం. మా మూవీని చూసి బాగుందా? లేదా? అన్న అభిప్రాయాన్ని ఆడియెన్స్ చెబుతారని ఆశిస్తున్నాం. 'లగ్గం టైం'ని చూసి థియేటర్ నుంచి మనస్ఫూర్తిగా నవ్వుతూ వెళ్తారని మాత్రం గ్యారెంటీగా చెప్పగలను' అన్నారు.

## బిగ్‌బాస్ నుంచి హీరోగా.. అమర్‌లిదీప్ ఏం చేస్తాడో?



తెలుగు ఇండస్ట్రీలో ఇప్పటికే పదుల సంఖ్యలో హీరోలున్నారు. ఎప్పటికప్పుడు కొత్తవాళ్లు వస్తూనే ఉన్నారు. ఈ వారం కూడా తెలుగు బిగ్‌బాస్ ఫేమ్ అమర్‌దీప్ హీరోగా పరిచయమవుతున్న 'సుమతీ శతకం' అనే మూవీ విడుదలకు సిద్ధమైంది. ఒక్క ఛాన్స్ ఇవ్వండి ప్లీజ్ అని వేడుకుంటున్న అమర్‌దీప్.. ఎలాంటి ఫలితాన్ని అందుకుంటాడు? అసలు ఇంతకీ ఈ మూవీ సంగతేంటి? గతంలో బిగ్‌బాస్ నుంచి వచ్చి హీరోలు అయినవాళ్లు ఎక్కడున్నారు? ఇండస్ట్రీలో హీరోగా నిలబడటం అంత సులభం కాదు. తెలుగు రియాలిటీ షో బిగ్‌బాస్‌లో ఫేమ్ తెచ్చుకుంటున్న సొహైల్, సన్నీ లాంటి వాళ్లు.. ఆ క్రేజ్ నిజమనుకుని హీరోలుగా పలు మూవీస్ చేశారు. కాకపోతే రెగ్యులర్ రొటీన్ కమర్షియల్ మూవీసే చేయడంతో అవి సక్సెస్ కాలేదు. దీంతో కొన్నాళ్లకే ఇండస్ట్రీని పూర్తిగా వదిలేశారు. అమర్‌దీప్ కూడా కొన్నిరోజుల క్రితం ఇదే చెప్పాడు. బిగ్‌బాస్ ఓట్లు దేనికీ పనికిరావు అని అన్నాడు. కానీ ఇండస్ట్రీలో పరిస్థితులు కొత్త హీరోలకు కలిసొచ్చేలా ఉన్నాయా అంటే లేవనే చెప్పొచ్చు. ఎందుకంటే పాన్ ఇండియా కల్చర్ విపరీతంగా పెరిగిపోయిన తర్వాత తెలుగు ఆడియెన్స్.. చిన్న సినిమాలని అందులోనూ రొటీన్ కమర్షియల్ చిత్రాలు చూసేందుకు మునుపటిలా పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. అమర్‌దీప్ 'సుమతీ శతకం' ట్రైలర్ చూస్తుంటే ఇది కూడా సాధారణ సినిమాలానే అనిపిస్తుంది. దానికితోడు ఈ వారం దాదాపు 10 వరకు మూవీస్, థియేటర్లలోకి రానున్నాయి. వీటన్నింటిని దాటుకుని అమర్‌దీప్ చిత్రానికి ప్రేక్షకులు వస్తారా అనేది చూడాలి. అలానే రీసెంట్‌గా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మాట్లాడిన అమర్‌దీప్.. 'ఒక్క ఛాన్స్ ఒకే ఒక్క ఛాన్స్.. నేనేంటో చూపిస్తా. ఇది హిట్ కాకపోతే మరెప్పుడు ఇలా ఒక్క ఛాన్స్ అని అడగను. ఒక్క ఛాన్స్ ఇచ్చి చూడండి. సుమతీ శతకం చూస్తారు. నేనేంటో మీకు తెలుస్తుంది' అని అన్నాడు. మరి ఈ మాట మీద ఎంతవరకు నిలబడతాడో చూడాలి?

## ఇది మిమ్మల్ని వెంటాడుతూనే ఉంటుంది



నవీన్ చంద్ర, దివ్య పిళ్లై ప్రధాన పాత్రల్లో సైకాలజికల్ డెప్త్, సోషల్ రిలెవెన్స్, హారర్ అంశాలతో రూపొందిన చిత్రం 'హనీ'. ఈ సైకలాజికల్ హారర్ మూవీ ఫిబ్రవరి 6న థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధం అవుతుండగా..తాజాగా మేకర్స్ ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ.. 'ట్రైలర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా ఫిలిం మేకింగ్ ప్రాసెస్ నేను చాలా ఎంజాయ్ చేశాను.ఇది మౌత్ టాక్‌తో నిలబడే సినిమా. మాకు ఉన్న బడ్జెట్లో థియేటర్స్‌కి తీసుకొచ్చి ఆడియన్స్‌కి ఒక డిఫరెంట్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలని నేను ఎప్పుడు ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. ఫిబ్రవరి 6న దయచేసి ఒకసారి థియేటర్‌కి రండి. ఇది థియేటర్‌కి చాలా బాగుంటుంది.సినిమా మిమ్మల్నీ వెంటాడుతూనే ఉంటుంది. ఆలోచన రేకెత్తించే విధంగా ఉంటుంది. ఈ సమాజంలో ఆశ కోసం ప్రజలు ఏవేవో చేస్తున్నారు. ఇందులో ఒక డార్క్ సొసైటీని చూపించాము. కచ్చితంగా అందరిని ఆకట్టుకుంటోంది అనే నమ్మకం ఉంది' అని తెలిపాడు. కాగా.. కరుణ కుమార్ రచన, దర్శకత్వం వహించిన ఈ సైకలాజికల్ హారర్ మూవీని ౹ాఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించారు. శేఖర్ స్టూడియోస్ సమర్పిస్తోంది.

## ఇలా జరుగుతుందని అస్సలు ఊహించలేదు..



కన్నడ కిచ్చా సుదీప్, వెండితెరపై అడుగుపెట్టి మూడు దశాబ్దాలు (30 ఏళ్లు) పూర్తి చేసుకున్నాడు. ఈ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని, పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన ఆయన, తన జర్నీపై ఎమోషనల్ నోట్‌ను విడుదల చేశాడు.కేవలం ఒక నటుడిగా మాత్రమే కాకుండా.. దర్శకుడిగా, నిర్మాతగా, సింగర్‌గా, 'బిగ్‌బాస్' హోస్ట్‌గా మల్టీ టాలెంటెడ్ హీరోగా గుర్తింపు పొందిన సుదీప్, ఇన్నాళ్లు ఆదరించిన ప్రేక్షకులకు శిరస్సు వంచి నమస్కరించారు. "ఎన్నో కలలతో ఇండస్ట్రీలోకి వచ్చిన ఒక సామాన్య కుర్రాడిని, ఈ రోజు ఈ స్థాయికి చేర్చింది కేవలం అభిమానుల ప్రేమే" అని సుదీప్ పేర్కొన్నారు. దర్శకనిర్మాతలు తనపై ఉంచిన నమ్మకం, తోటి నటీనటులు, సాంకేతిక నిపుణుల టీమ్ వర్క్ వల్లే ఇదంతా సాధ్యమైందని ఆయన గుర్తు చేసుకున్నారు. కన్నడ ఇండస్ట్రీ తనకు గుర్తింపునిచ్చిందని, ఇక్కడి మూలాలే తనను నిలబెట్టాయని చెబుతూ.. తెర వెనుక పనిచేసే ప్రతి ఒక్క లైట్ బాయ్ నుండి టెక్నీషియన్ వరకు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. సినీ ప్రపంచంలో ఎన్నో కలలతో అడుగుపెట్టిన తాను ఈ స్థాయికి చేరుకుంటానని కలలో కూడా ఊహించలేదని ఆనందం వ్యక్తం చేశాడు.



## బాక్సాఫీస్‌పై 'బోర్డర్ 2' దూకుడు.. రూ.300 కోట్ల క్లబ్‌లోకి ఘనంగా ఎంట్రీ

బాలీవుడ్‌లో క్లాసిక్ వార్ డ్రామాగా నిలిచిన 'బోర్డర్' చిత్రానికి సీక్వెల్‌గా వచ్చిన 'బోర్డర్ 2' (దీశీతీసవతీ 2) బాక్సాఫీస్ వద్ద జైత్రయాత్రను కొనసాగిస్తోంది. సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో, అనురాగ్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ పీరియడ్ వార్ డ్రామా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. దేశభక్తి భావోద్వేగాలు, యుద్ధ సన్నివేశాల భీకరత, సాంకేతిక నైపుణ్యం ఈ చిత్రాన్ని భారీ హిట్ దిశగా నడిపిస్తున్నాయి.విడుదలైన 10వ రోజుకే ఈ సినిమా కీలక మైలురాయిని అందుకుంది. ముఖ్యంగా రెండో ఆదివారం రోజున బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను నమోదు చేయడం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. రెండో ఆదివారం ఒక్కరోజే సుమారు రూ.24.22 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించడంతో ఈ చిత్రం భారత్‌లో ప్రతిష్ఠాత్మకమైన రూ.300 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టింది. తాజా గణాంకాల ప్రకారం, దేశవ్యాప్తంగా ఈ సినిమా మొత్తం నెట్ వసూళ్లు రూ.301.89 కోట్లకు చేరుకున్నట్లు సమాచారం. అయితే అసలైన పరీక్ష ఇప్పుడే ప్రారంభమవుతుందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు. వారాంతపు హైప్ తర్వాత సోమవారం నుంచి కలెక్షన్లు తగ్గే అవకాశం ఉండటంతో, దీర్ఘకాలంలో సినిమా ఎంత స్థాయిలో రాణిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. అయినప్పటికీ మొదటి రెండు వారాల్లోనే ఈ స్థాయి వసూళు సాధించడం 'బోర్డర్ 2'కు ఉన్న క్రేజ్‌ను స్పష్టంగా చూపిస్తోంది. ఇదిలా ఉంటే, ఈ చిత్ర విజయోత్సాహంలోనే మేకర్స్ మరో కీలక ప్రకటన చేశారు. 'బోర్డర్ 3' ను కూడా అధికారికంగా ప్రకటిస్తూ అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. టీ-సిరీస్ ఫిల్మ్స్ మరియు జెపి ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌లో వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్, అహన్ శెట్టి, మోనా సింగ్, సోనమ్ బజ్వా తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో 'బోర్డర్' ఫ్రాంచైజీపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి పెరిగింది.మొత్తంగా చూస్తే, దేశభక్తి కథాంశంతో వచ్చిన 'బోర్డర్ 2' బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతూ, వరుస రికార్డులు సృష్టిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ సినిమా ఇంకా ఎలాంటి మైలురాళ్లు చేరుకుంటుందో అనేది సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## నా కెరీర్‌లో ఇది అత్యంత సవాలుతో కూడిన పాత్ర



అదితి రావ్ హైదరీ మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. గతంలో 'రాక్‌స్టార్' చిత్రంలో అతిథి పాత్రలో కనిపించిన ఆమె, ఇప్పుడు ఇమ్తియాజ్ అలీ క్రియేట్ చేసిన 'ఓ సాథీ రే' ద్వారా ఆయనతో కలిసి పని చేస్తోంది.నెట్‌ఫ్లిక్స్ నిర్మాణంలో వస్తున్న ఈ పీరియాడికల్ లవ్ స్టోరీపై అదితి స్పందిస్తూ.. ఇమ్తియాజ్ అలీతో పనిచేయాలనే తన చిరకాల కోరిక ఈ సినిమాతో నెరవేరిందని వెల్లడించింది. ఈ మూవీ షూటింగ్ సమయంలో ఇమ్తియాజ్ అలీ(ఎఎబితిజీళి ంశ్రీతి) పనితీరు తనను ఎంతగానో ఆకట్టుకుందని అదితి పేర్కొంది. "ఇమ్తియాజ్ మానిటర్ వైపు కూడా చూడరు, నేరుగా నటుల వైపు చూస్తూ సీన్ ఎలా వస్తుందో గమనిస్తారు. ఆయన ఎనర్జీ, అప్పటికప్పుడు కొత్త ఆలోచనలు చేసే తీరు నటిగా నాకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది" అని తెలిపింది. 'ఓ సాథీ రే' భావోద్వేగపరంగా చాలా లోతైన కథ అని, తన కెరీర్‌లో ఇది అత్యంత సవాలుతో కూడిన పాత్ర అని ఆమె చెప్పుకొచ్చింది. అయితే ఇలాంటి క్లిష్టమైన పాత్రలు చేయడమే ఒక నటిగా తనకు గొప్ప సంతృప్తిని ఇస్తుందని అదితి స్పష్టం చేసింది. ఇక ఈ సినిమాలో తన కో-స్టార్స్ గురించి కూడా అదితి ఆసక్తికర విషయాలు పంచుకుంది. 'గర్ల్ ఆన్ ఏ ట్రైన్' తర్వాత మళ్ళీ అవినాష్ తివారీతో కలిసి నటించడం ఆనందంగా ఉందని, ఆయన ఒక మంచి స్నేహితుడని తెలిపింది. అలాగే అర్జున్ రాంపాల్‌ను యూనివర్సల్ క్రష్‌గా చెప్తూ ఆయన సెట్స్‌లో చాలా ప్రొటెక్టివ్‌గా ఉంటారని ప్రశంసించింది. ఈ ప్రాజెక్ట్‌తో పాటు పంకజ్ త్రిపాఠితో కలిసి 'పారివారిక్ మనోరంజన్' అనే చిత్రంలోనూ, అలాగే ఒక సౌత్ థ్రిల్లర్ మూవీలోనూ తాను నటిస్తున్నట్లు అదితి అప్‌డేట్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ అదివి రావు కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.in epaper.vaarthasandhya.in. Cell : 73961 22101 , 99517 51662.